ఆదివారం

ప్రజాశక్తి

సెప్టెంబరు 21, 2003

మాఫియా + రాజకీయం + అధికారం = నకిలీ స్టాంపులు

హ్యాపీ బర్త్‌డే

(21.09.2003 నుండి 27.09.2003 వరకు)

షేక్ ఖాజావలి
23.09.2003
బషీర్ మహబూబ్‌బాష
గిద్దలూరు, ప్రకాశం జిల్లా

పొట్నీడి సూర్యసృజన్
24.09.2003
మంగాదేవి-చక్రరావు
పట్టాభిరెడ్డి గార్డెన్, విశాఖపట్నం

చొప్పల దినేష్
22.09.1999
సునీత-గోపి
అంతర్వేది, తూర్పుగోదావరి

మామిడి మానస
25.09.2000
మామిడి రమాదేవి- ఏడుకొండలు
పెదకాకాని, గుంటూరు

చిట్టిపోలు కార్తికేయ
21.09.2000
మంజుల-వేణు
ఖమ్మం

ప్రవలిక
27.09.2003
సునీత-రాంబాబు
చింతకాని, ప్రొద్దుటూరు, ఖమ్మం



బేబి ఆషా
22.09.1999
సులోచన-మహదేవ్
శ్రీ కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్

పవన్ సాయి
23.09.2002
శ్రీలక్ష్మి-పదీప్ కుమార్
శింగనమన,అనంతపురం

కె. అక్షయ
21.09.2002
కె. అనిత-కె. దేవేందర్
దస్నాపూర్, ఆదిలాబాద్.

ఎ. ప్రమోద్ కుమార్
17.09.2002
ప్రమీల-ఎ. రాంచందర్
చీమలదరికోనాపూర్, మెదక్‌జిల్లా.

రొయ్యపల్లి అఖిల
27.09.1998
సువర్ణ-శ్రీనివాస్
సంగారెడ్డి, మెదక్‌జిల్లా.

అంచల నిత్యశ్రీ
సెప్టెంబర్
మంజులవాణి- వెంకటరమణ
కొత్తపేట, రాయచోటి, కడప జిల్లా.



ఎస్. ఆవాజ్‌బాష
25-9-2002
అయిశబాను-ఎస్. మస్తల్ బాషా
బి.ఎస్.నగర్, కడప

కె.హెచ్.ఎస్. చందన
4-9-2002
శైలజ-సుబ్రమణ్యం
ఒంగోలు-ప్రకాశంజిల్లా.

ఎం. శ్రీనివాస్
18.09.2002
ఎం. విజయలక్ష్మి-వెంకటయ్య
తాండూర్, రంగారెడ్డి జిల్లా.

ఎం. వెంకట చంద్రవదన్
23.09.2002
భవాని శంకరి-పవన్‌కుమార్
ఇసకపాలెం (బుచ్చిరెడ్డి పాలెం)

ఎం. శరత్-చైతన్య
23.09.2003, 17.9.2003
శ్రీలక్ష్మి-సత్యనారాయణ
భట్టిప్రోలు, గుంటూరు

మహేష్
25.9.2002
లక్ష్మి-పెంటయ్య
కక్కర్‌వాడ, మెదక్ జిల్లా.

యాసీన్
22.9.2002
అహ్మద్‌బేగం-యదుల్లాహుస్సేన్
హుస్సేన్‌నగర్, మెదక్ జిల్లా.

మనలో మాట

దేశంలో దొంగలు పడ్డారు..

దొంగలు మన ఇల్లు దోచుకునే ముందు -

ఆ విషయమై మనకు ముందుగా నోటీసు ఇవ్వరు!

నోటీసులిస్తే మనం జాగ్రత్త పడతామని దొంగలకు తెలుసు. విషయం తెలిస్తే - మనం పలు జాగ్రత్తలు తీసుకుంటామని బాగా తెలుసు. పోలీసుల కాళ్ళాగడ్డాలట్టుకుని కాపలా పెట్టుకుంటామనీ తెలుసు!

ఇన్ని ఏర్పాట్లతో మనం జాగ్రత్త పడినప్పుడు - దొంగతనం చేసేందుకు ఎంత లావు దొంగాడికైనా కష్టంగానే ఉంటుంది. కోరి మరీ ప్రమాదాన్ని కొనుక్కున్నట్టే అవుతుంది!

అంచేత -

దొంగలు నోటీసుల జోలికి వెళ్ళరు!

దొంగలకు సెలవలుండవు. అన్ని రోజులూ వాళ్ళకి పని దినాలే! ఇవాళ రెండో శనివారమనీ, రేసు ఆదివారమనీ లెక్కలు వేసుకోరు. ఆదివారాలు లేవు అమావాస్యల్లేవనే టైపులో - వాళ్ళకు ప్రతి రోజూ పని ఉంటుంది!

దొంగలు తిథివారనక్షత్రాలు చూసుకోరు! వాటి కోసం పంచాంగం చంకలో పెట్టుకుని తిరగరు! ఇవాళ అష్టమి గనక కష్టాల్లో పడతామనే భీతి వాళ్ళకుండదు. విదియ గనక విజయం మనదే అనే ధీమాతో తలుపులు చితగ్గొట్టరు!

వాళ్ళు డ్యూటీ చేసే ముందు చిలక జోస్యం చెప్పించుకోరు. ఇవాళ సెలవు తీసుకోండని చిలకమ్మ ఆర్తనాదం చేస్తూ ఆందోళనతో కార్డు లాగినా డోంట్‌కేరంటారు. పంతులుగారు పంచాంగం చూచి - ఇవాళ బుద్ధిగా ఇంటో ఉండమని సలహాయిస్తే ఛీపొమ్మంటారు!

శుక్రుడు నీచ స్థానంలో ఉండి వక్రంగా చూస్తున్నాడు కాబట్టి దొంగతనం నీకు కలిసిరాదని హెచ్చరించినా పట్టించుకోరు. దొంగతనం చేసే ప్రయత్నంలో పొరపాటున నువ్వు కప్ప మీద కాలు వేసినా నీకు ఉరిశిక్ష పడిపోతుందని పంతులుగారు వార్నింగిస్తే - పంతులుగారి ముక్కు పచ్చడి చేస్తారు!

చేద్దెబ్బ లేకపోతే చేతులు పడిపోతాయని నిజం చెబుతారు!

మామూలు అనగా ఆర్డినరీ దొంగలు దేశం నిండా ఉన్న మాట నిజం కావచ్చు. వాళ్ళ వరస ఇట్లాగే అఘోరిస్తుంది!

జాతి దొంగలు సంఖ్యాపరంగా కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రజా ప్రతినిధులమనే పవిత్రమైన ముసుగులు కప్పుకుని దేశాన్ని కొల్ల గొట్టేందుకు సిద్ధంగా ఉంటారు. ఈ మధ్య వాళ్ళ చిరునామాలు తెలుసుకుని ప్రజలు భయభ్రాంతులవుతున్నారు!

సాక్షాత్తు రక్షకులే భక్షకులుగా మారుతున్న తరుణంలో - ఈ దేశం ఏమైపోతుందోనని ఆందోళన పడుతున్నారు! ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్ స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
ఇంతిసంగతులు	. . . 15
క్రీడారంగం	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
రియల్ స్టోరీ	. . . 22
పలుకుబడి	. . . 24

ఇంకా...

పిల్లల్లో అబద్ధాలు - పెద్దల పాత్ర
బాలవికాసం . . . 10



ప్రాచీన శిల్పాలయం గుడిమల్లం
టూరిస్ట్‌గైడ్ . . . 16



ఓ తండ్రి కథ
కథ . . . 18, 19

నేటికీ గుభాళిస్తున్న సురభి నాటక సౌరభాలు

కళాసాహితి . . . 21

కార్టూన్ కదంబం


ఇంకేం చేతకావాలంటు?!
మోడీ
వెంకయ్య
గోధ్రా మారణ హోమం
గుజరాత్ మతకల్లోలాలు
'బెస్ట్ బేకరి'
మతోన్మాద ప్రకటనలు
చేతకాకుంటే తప్పుకో
మోడీ ప్రభుత్వానికి
సుప్రీం మందలింపు


సర్వం 'కృష్ణ' మయం సార్..!!
తెదే ఎమ్మెల్యే
ముగిసిన ఇంటింటికి
దేశం ప్రచారం
గంగాధర్

టా..టా!!
నకిలీ స్టాంపులు
నకిలీ విత్తనాలు
నకిలీ కరెన్సీ
పనికి ఆహారం
1

సుప్రీం

✻ కె.ఎస్.వి.ప్రసాదరావు

మాఫియా + రాజకీయం + అధికారం = నకిలీ స్టాంపులు



స్టాంపుల కుంభకోణం ఒక్క తెల్గీకే పరిమితం కాదు... నకిలీ స్టాంపులు దేశం నలు చెరగులా వ్యాపించాయి. రాజకీయం, అధికారం, బ్యూరోక్రసీ మాఫీయాతో కలిస్తేనే ఇది సాధ్యం...వ్యవస్థలోని లొసుగులను తనకనుకూలంగా మార్చుకొని 'హీరో' అయిన వ్యక్తి అబ్దుల్ కరీంతెల్గీ. అతన్ని ఒక వ్యక్తిగా పోల్చడం ఏమాత్రం తగదు. 'మహా వినాశకరశక్తి' అంటే సముచితం. కూటికోసం రైల్వేస్టేషన్లో పల్లీలమ్ముకున్న ఒక సాదాసీదా వ్యక్తి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ వ్యక్తులను కలవర పెడుతున్నాడు. అతను నోరు విప్పితే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల పునాదులు కదులుతాయి. పోలీసు అధికారుల సంగతి సరేసరి. తెల్గీ పేరు తెలుగుదేశంతో సహా కొన్ని రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

స్టాంపుల కుంభకోణం ఒక్క తెల్గీకే పరిమితం కాదు... నకిలీ స్టాంపులు దేశం నలు చెరగులా వ్యాపించాయి. రాజకీయం, అధికారం, బ్యూరోక్రసీ మాఫీయాతో కలిస్తేనే ఇది సాధ్యం...వ్యవస్థలోని లొసుగులను తనకనుకూలంగా మార్చుకొని 'హీరో' అయిన వ్యక్తి అబ్దుల్ కరీంతెల్గీ. అతన్ని ఒక వ్యక్తిగా పోల్చడం ఏమాత్రం తగదు. 'మహా వినాశకరశక్తి' అంటే సముచితం. కూటికోసం రైల్వేస్టేషన్లో పల్లీలమ్ముకున్న ఒక సాదాసీదా వ్యక్తి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ వ్యక్తులను కలవర పెడుతున్నాడు. అతను నోరు విప్పితే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల పునాదులు కదులుతాయి. పోలీసు అధికారుల సంగతి సరేసరి. తెల్గీ పేరు తెలుగుదేశంతో సహా కొన్ని రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

నకిలీస్టాంపుల కుంభకోణం నేటికి 32 వేల కోట్ల రూపాయలకు చేరుకుంది. రేపు ఎంతకు చేరుతుందో ఊహించలేం. పన్నెండేళ్ల క్రితం మహారాష్ట్రలో దానికి బీజం పడింది. నిరాఘాటంగా కొనసాగుతోంది. నకిలీ స్టాంపులు ఎప్పటి నుండి చెలామణిలో ఉన్నాయో ఎవరికీ తెలీదు. 1991లో ఈ అంశం బయటికొచ్చింది. తెల్గీ నిందితుడు. అక్కడి నుండి 'నకిలీ' పర్వం అవిచ్ఛిన్నంగా సాగుతోంది. దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన సెక్యూరిటీ కుంభకోణం విలువ ఐదు వేల కోట్లు. దాని రూపశిల్పి హర్షద్‌మెహతాను 'బిగ్‌బుల్'గా అప్పట్లో పత్రికలు అభివర్ణించాయి. స్టాంపుల కుంభకోణం 32 వేల కోట్ల రూపాయలకు చేరినట్లు మహారాష్ట్ర ఉపముఖ్యమంతి భుజ్‌బల్ ఇటీవల ప్రకటించారు. ఆ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కంటే ఎక్కువని ఆయన చెప్పారు. కేంద్ర నేర పరిశోధన సంస్థ (సిబిఐ) కూడా దీన్ని ధ్రువీకరించింది. తొలుత మహారాష్ట్రకు పరిమితమైన ఈ స్కాం స్వల్పవ్యవధిలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులతో సహా మొత్తం 17 రాష్ట్రాలకు విస్తరించింది. చిన్న మోసగాళ్ల దగ్గర నుండి పలువురు రాజకీయ నాయకులతో, పోలీసు అధికారులతో పెనవేసుకుంది. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజ్‌వాదీ జనతాదళ్ శాసనసభ్యుడు గోటే అరెస్టుతో కుంభకోణం తీవ్రత వెలుగులోకొచ్చింది. తెలుగుదేశం శాసనసభ్యుడు కృష్ణయాదవ్‌ను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడంతో స్టాంపుల స్కాం ఒక్కసారిగా వార్తల్లోకొచ్చింది. రాష్ట్రంలో చర్చనీయాంశమైంది.

1991 నుండి మహారాష్ట్రలో, 1997 నుండి కర్నాటకలో, 1999 నుండి ఆంధ్రప్రదేశ్‌లో నకిలీస్టాంపులు చెలామణి అవుతున్నట్లు ఆయా రాష్ట్రాల పోలీసులు కనుగొన్నారు. కేసులు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు జరగలేదు. నకిలీ వల్ల ప్రయివేటు వ్యక్తులకు ఏ విధమైన ఇబ్బందీ లేదు. ప్రభుత్వాదాయానికి నష్టం వాటిల్లే కేసులు కాబట్టి పోలీసులు అంతగా పట్టించుకోలేదు. బెంగుళూరులోని సిటీ మార్కెట్ పోలీస్‌స్టేషన్లో 1997లో రెండు 'నకిలీ' కేసులు నమోదయ్యాయి. అదే పోలీస్‌స్టేషన్లో 1998లో మరో రెండు కేసులు రికార్డయ్యాయి. 1999లో యశ్వంత్‌పూర్, ఆర్‌టి నగర్ స్టేషన్లలో నమోదైన కేసులో తెల్గీ పేరు బయటికొచ్చింది. ఆయన్ని అరెస్టు చేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 2000 సంవత్సరంలో బెంగుళూరులో పెద్ద ఎత్తున నకిలీస్టాంపులను స్వాధీన పర్చుకున్నారు. ప్రధాన నిందితుడిగా తెల్గీ పేరు నమోదు చేశారు. వరుస కేసులతో తెల్గీ కోసం పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో తెల్గీ ఉన్నట్లు 2001 సెప్టెంబరు మొదటి వారంలో బెంగుళూరు సిటీ పోలీసు కమిషనరుకు సమాచారం అందింది. నవంబరు 7న అతన్ని పోలీసులు అరెస్టు చేసి బెంగుళూరుకు తరలించారు. అప్పటి నుండి తెల్గీ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. విచారణ కొనసాగుతున్నందున కర్నాటకను విడిచి వెళ్లరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నాలుగు తడవలు తెల్గీ పెట్టుకున్న బెయిలు పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది. జైల్లో ఉండి కూడా తెల్గీ తన కార్యకలాపాలను కొనసాగించాడు. తన తమ్ముడు అజీమ్

ఎవరీ తెల్గీ...?

దేశ వ్యాప్తంగా మీడియాలో పతాక శీర్షికలెక్కుతున్న తెల్గీ ఎవరో తెలుసా? పూర్తి పేరు అబ్దుల్ కరీంలాలా తెల్గీ. కర్నాటకలోని బీజాపూర్ జిల్లా తెల్గీ గ్రామం. చదివింది బీకాం. తండ్రి ఖానాపురంలో రైల్వే స్టేషన్ మాస్టర్. నిరుపేద కుటుంబం కావడంతో తండ్రికి సాయపడటానికి తొలుత రైల్వేస్టేషన్లో పల్లీలమ్మాడు. ఉద్యోగ వేటలో 1982లో గల్ఫ్ వెళ్లాడు. అక్కడ అచ్చిరాక తిరిగి స్వదేశం చేరుకున్నాడు. ముంబయిలో కిరోసిన్ డీలర్‌షిప్ సంపాదించాడు. అదే అతని జీవితంలో మూల మలుపు. ప్రభుత్వాదాయానికి ఏ విధంగా గండి కొట్టాలనే పాఠాలను అప్పుడే చదువుకున్నాడు. ఈ సమయంలో మాఫియా నేత దావూద్ ఇబ్రహీంతో పరిచయం ఏర్పడింది. ఐఎస్ఐతో సహా సీమాంతర సంస్థలతో సంబంధాలు పెట్టుకున్నాడు. వాటితో కలిసి దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే పనిలో నిమగ్నమయ్యాడు. స్టాంపుల కుంభకోణానికి రూపశిల్పిగా మారాడు. ఎప్పటి నుండి నకిలీస్టాంపులను చెలామణిలో పెట్టాడనే విషయం ఇప్పటికీ స్పష్టం కాలేదు. మహారాష్ట్రలో 1991లో తెల్గీపై తొలి కేసు నమోదైంది. దీన్నే పోలీసులు పరిగణనలోకి తీసుకున్నారు. తెల్గీ ఆయుధం నిరుద్యోగమే. కర్నాటకలోని నిరక్షరాస్యులను చేరదీశాడు. ఎంబిఎ వంటి ఉన్నత చదువులు చదివిన వారికి పరిచయం చేశాడు. ఈ విధంగా 600 మంది యువకులను నకిలీస్టాంపుల చెలామణికి ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. 1995లో తెల్గీ ప్రభుత్వ స్టాంపు వెండరు అవతారం ఎత్తినట్లు ఆధారాలున్నాయి. రాజకీయ నాయకులను, పోలీసు అధికారులను డబ్బుతో కొన్నాడు. ఢిల్లీ నుండి గల్లీ దాకా రాజకీయ నేతలతో సంబంధాలున్నాయి. స్టాంపులను ముద్రించే నాసిక్‌లోని ఇండియన్ సెక్యూరిటీ ప్రెస్‌పై తెల్గీ కన్ను పడింది. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్లు ప్రెస్‌లో పని చేసే కొంత మంది ఉద్యోగులను తన దారికి తెచ్చుకున్నాడు. పనికిరాకుండా పోయిన మిషనరీని, ఇనుప వస్తువులను కరిగించిన తర్వాత వాటిని అధికారులు వేలం వేసేవాళ్లు. కొంత మందిని 'మేనేజ్' చేసి పాత వస్తువులను అదే విధంగా కొనుగోలు చేశాడు. ప్రెస్ పర్చేజ్ ఆఫీసర్ ఎస్ఆర్ శర్మ అందుకు సహకరించాడని ఇటీవల పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామచంద్రారెడ్డి ప్రెస్‌లో యుడిసిగా పని చేసేవాడు. ఇక్కడి రాజకీయ నేత రికమండేషన్‌తో రామచంద్రారెడ్డిని ఉపయోగించి 1997లో పాత యంత్రాలను కొనుగోలు చేశాడు. అందుకు ఇద్దరు కేంద్ర మంత్రులు సహకరించారని విమర్శలొస్తున్నాయి. వారిలో ఒకరు ఇప్పటికీ కేబినెట్‌లో కొనసాగుతున్నారు? ప్రభుత్వ ప్రెస్‌లోని ప్లేట్లను, ఇతర ముద్రణ యంత్రాలతో ప్రెస్‌ను నెలకొల్పి నకిలీస్టాంపులను ముద్రించి దేశ వ్యాప్తంగా చెలామణిలో పెట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ప్రభుత్వ ప్రెస్‌కు ఎవరైతే పేపరును సరఫరా చేస్తున్నారో వారిని మచ్చిక చేసుకున్నాడు. ఆ సంస్థ ద్వారానే తన ప్రెస్‌కూ పేపర్ సరఫరా అయ్యే విధంగా ఏర్పాటు చేసుకున్నాడు. తన కార్యకలాపాల విస్తరణకు హైటెక్ పద్ధతులను అవలంబించాడు. స్ట్రక్చర్‌ను ఏర్పాటు చేశాడు. 69 బ్యాంకుల్లో అక్కౌంట్లు తెరిచాడు. హెచ్‌డిఎఫ్‌సితో సంబంధాలున్నాయి. ముంబయిలోని అశోక్‌లేలాండ్, టెల్కో డీలర్లకు, ఇన్సూరెన్స్, బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థలకు పెద్ద ఎత్తున నకిలీ స్టాంపులను సరఫరా చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. పలుతడవలు నిర్వహించిన దాడుల్లో సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, కంప్యూటర్లు, ఏటిఎం కార్డులు వారికి లభ్యమయ్యాయి. తెల్గీపై మహారాష్ట్రలో హత్య కేసు నమోదైంది. కర్నాటకకు చెందిన క్రిస్టోఫర్ అనే వ్యక్తి స్టాంపుల అమ్మకంలో ఎదురు తిరిగాడు. ముంబయిలో క్రిస్టియన్ కాలనీలోని కఫెపెరడే ఫ్లాటులో క్రిస్టోఫర్‌ను 2001 ఆగస్టు 27న తెల్గీ హత్య చేసినట్లు కేసు నమోదైంది. కేసు బయటికి రాకుండా అప్పటి పోలీసు అధికారులు తెల్గీకి సహకరించారు. ఫ్లాటులో అతనికి రాచమర్యాదలు చేశారు. విందులు, వినోదాలతో తరించారని జైస్వాల్ కమిటీ రిపోర్టులో పేర్కొంది. జైల్లో ఉండి కూడా తన తమ్ముడు అజీం, మరికొంత మంది ముఖ్యమైన అనుచరులతో కార్యకలాపాలను నిరాఘాటంగా సాగించాడు.

బాలీవుడ్‌లో పెట్టుబడులు

స్టాంపుల కుంభకోణం సూత్రధారి తెల్గీ బాలీవుడ్‌లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాడు. తన కూతురు పేరు మీద 'సనా' అనే పంపిణీ సంస్థను నెలకొల్పాడు. 'జిస్ దేశ్ మే గంగా రెహతా హై' అనే సినిమాను దేశ వ్యాప్తంగా పంపిణీ చేసింది ఈ సంస్థే. ఈ సినిమా నిర్మాత జాకీష్రాఫ్. దర్శకుడు మహేష్ మంజ్రేకర్. నటీనటులు గోవిందా, సోనాలీ బింద్రే. తమిళ సినిమా 'ఇన్నమకన్ను', హాలీవుడ్ నటుడు జాకీచాన్ నటించిన 'షాంఘైనూన్'లను 'సనా' పంపిణీ చేసింది. ఎ గ్రేడ్ సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా మారింది. లో బడ్జెట్ సినిమాలను నిర్మించింది. దీనికి ఉదాహరణ సురేష్‌ఖెత్రి, మూన్‌మూన్‌సేన్ నటించిన 'బెచారీ'. రెండేళ్ల క్రితం దీని నిర్మాణం పూర్తయింది. ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. 'బీవీ కమాల్‌కీ-సాలీ దమాల్‌కీ' అనే సినిమా ముహూర్తం షాట్‌కే పరిమితమైంది. స్టాంపుల స్కామ్ బయట పడటంతో 2002 జూన్ 19న ముహూర్తం ఫోటోలను ముంబయి పోలీసులు స్వాధీనపర్చుకున్నారు.

సాయంతో మరి కొంత మంది అనుచరులతో నకిలీస్టాంపులను చెలామణి చేశాడు. తెల్గీ అరెస్టు తర్వాత పోలీసులు నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకోవడం ఆ ప్రభుత్వాన్ని విస్మయానికి గురి చేసింది. మేల్కొన్న కర్నాటక ప్రభుత్వం స్టాంపుల కుంభకోణంపై విచారణకు అడిషనల్ డిజిపి ర్యాంక్ అధికారి శ్రీకుమార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో నమోదైన ఆరు కేసులకు సంబంధించి తెల్గీతో సహా 65 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సదాశివ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. తెల్గీకి పలువురు అధికారులతో, రాజకీయ నాయకులతో సంబంధాలున్నట్లు వార్తలొచ్చాయి. తెల్గీ సోదరుడు అజీమ్‌ను ఇటీవల మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ విభాగం ఉపాధ్యక్షుడిగా అజీమ్ గతంలో పని చేశాడని పోలీసులు పేర్కొన్నారు. తెల్గీ విషయంలో కర్నాటక మంత్రి రోషన్‌బేగ్ ఆరోపణలెదుర్కొంటున్నారు.

నకిలీస్టాంపుల ప్రస్థానం మహారాష్ట్రలో 1991లో ప్రారంభమైంది. ఒషివారా పోలీసుస్టేషన్లో 549 క్రైం నెంబరుతో తెల్గీపై తొలికేసు నమోదైంది. 1995 తర్వాత 15 కేసులు రికార్డయ్యాయి. కేసుల నమోదు తప్ప సమగ్రమైన విచారణ జరగలేదు. దృష్టికొచ్చినప్పుడు నాన్‌జ్యుడీషియల్, అడ్‌హెసివ్, జ్యుడీషియల్, రెవెన్యూ స్టాంపులను పోలీసులు సీజ్ చేశారు. సాదాసీదాగా నిందితులను అరెస్టు చేసి వదిలేశారు. కర్నాటకలో తెల్గీ అరెస్టయ్యాక మహారాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చింది. స్టాంపుల సూపర్‌వైజర్ మోపాల్వార్ ఫిర్యాదు తర్వాత తెల్గీపై కేసులు నమోదయ్యాయి. పూనెలోని బండ్వాడ స్టేషన్లో దర్యాప్తు ప్రారంభమైంది. జూన్ 2002లో తెల్గీ నడుపుతున్న ప్రెస్‌పై పోలీసులు దాడి చేశారు. 2750 కోట్ల రూపాయల విలువ చేసే నకిలీస్టాంపు పేపర్లను, మిషనరీని, స్టాంపుల ముద్రణకు ఉపయోగించే 300 టన్నుల పేపరును స్వాధీన పర్చుకున్నారు. ఈ ఘటన ఊహించని మలుపు. అప్పటి వరకు నకిలీస్టాంపుల చెలామణి తక్కువ స్థాయిలో ఉందనుకున్న పోలీసులకు కనువిప్పు కలిగింది. తెల్గీ కార్యకలాపాలు 17 రాష్ట్రాలకు విస్తరించాయని, వివిధ రాష్ట్రాల్లో నకిలీలను చెలామణిలో పెట్టాడని స్పష్టమైంది. ముంబయి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 35 రిజిస్ట్రేషన్లు నకిలీ స్టాంపు పేపర్లపై జరిగినట్లు గుర్తించారు. వేడి పుంజుకుంది. నకిలీ పత్రాలపై రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వ్యక్తుల నుండి స్టాంపు డ్యూటీని వసూలు చేస్తామని ఆ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి ప్రకటించడంతో ప్రజల్లో అలజడి ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ కుంభకోణానికి వ్యతిరేకంగా బిజెపి తదితర ప్రతిపక్షాలు ఆందోళన ప్రారంభించాయి. ప్రముఖ సంఘ సేవకుడు అన్నాహజారే 2002లో ముంబయి హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేశారు. అప్పటి వరకు నోరు మెదపని మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై స్పందించింది. సమగ్ర నివేదిక కోసం ఎస్ఆర్‌పిఎఫ్ డిఐజి ఎస్‌కె జైస్వాల్‌ను నియమించింది. ఈ ఏడాది ఏప్రిల్ 5న ఆయన 105 పేజీల రిపోర్టును, 605 పేజీల అనుబంధ కాపీలను ప్రభుత్వానికి సమర్పించారు. 1995 నుండి రాష్ట్రంలో

నమోదైన నకిలీస్టాంపుల కేసులను విచారించిన పోలీసు అధికారులపై తీవ్రమైన అభియోగాలు మోపారు. తెల్గీ నిందితుడిగా ఉన్న 15 కేసుల దర్యాప్తు అధికారుల, పర్యవేక్షణాధికారుల వైఖరిని తప్పుబట్టారు. సీనియరు పోలీసు అధికారులను సైతం ఆయన వదిలిపెట్టలేదు. అప్పట్లో పూనె కమిషనరుగా ఉన్న ఆర్ఎస్ శర్మ, జాయింట్ కమిషనరు మహేష్‌గౌరి, డిప్యూటీ కమిషనరు ప్రదీప్ సావంత్‌ల వ్యవహారాన్ని జైస్వాల్ తన నివేదికలో తప్పుబట్టారు. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. ఆర్ఎస్‌శర్మ ప్రస్తుతం ముంబయి కమిషనరుగా (డిజిపి ర్యాంక్) పని చేస్తున్నారు. జైస్వాల్ రిపోర్టును సీనియరు పోలీసు అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించక ముందే సమాచారం లీకైందంటూ గొడవ చేశారు. జైస్వాల్ నివేదికపై నిశ్చేష్టుడైన ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే కుంభకోణం విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. తెల్గీకి సహకరించిన 27 మంది పోలీసు అధికారులపై చర్యలకు ఆదేశించారు. వారిలో కొందరిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఉన్నతాధికారులపై సైతం సస్పెన్షన్ వేటు పడింది. సిట్‌కు జైస్వాల్ నాయకత్వం వహిస్తున్నారు. పోలీసు అధికారుల పాత్రను వెలికి తీయడానికి రిటైర్డ్ డిజిపి ఎస్ఎస్ పురిని ప్రభుత్వం నియమించింది. ఆయన సిట్‌కు అనుబంధంగా పని చేస్తున్నారు. బండ్వాడ స్టేషన్ నుండి కేసు దర్యాప్తు సిట్‌కు బదిలీ అయింది. జైస్వాల్, పూనె డిసిపి వాక్డె దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

సిట్ ఏర్పాటు చేశాక తెల్గీకి సంబంధించిన కథనాలు బయటికొచ్చాయి. ముంబయిలో ఆయన ఇంటిపై దాడి చేసినప్పుడు కొన్ని కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. కంప్యూటర్, సీడీలు, ఆడియో టేపులు దొరికాయి. వాటి ఆధారంగా దర్యాప్తు ముందుకు సాగింది. పోలీసుశాఖ యావత్తు తెల్గీకి రెడ్ కార్పెట్ పర్చి సేవ చేసిందని ఒకో వార్త బయటికొచ్చింది. మహారాష్ట్ర వ్యవస్థీకృత నేర నిరోధక చట్టం కింద నిందితులపై కేసులు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. స్టాంపుల కుంభకోణం విచారణకు పూనెలో ప్రత్యేక కోర్టును ప్రభుత్వం నెలకొల్పింది. సిట్ ఇప్పటి వరకు 54 మందిని అరెస్టు చేసింది. వారిలో ఎమ్మెల్యేలు కృష్ణయాదవ్, గోటే ఉన్నారు. పలువురు పోలీసు అధికారులనూ సిట్ అదుపులోకి తీసుకొంది. తెల్గీ సోదరుడు అజీమ్‌ను అరెస్టు చేసింది. వీరందరిపై వ్యవస్థీకృత నేరాల చట్టాన్ని మోపింది. సిట్ అధికారులు రెండుసార్లు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 1100 పేజీలతో గత మార్చిలో 35 మంది నిందితులపై ఛార్జిషీట్ పెట్టారు. ఈ నెల 15న మరో ఆరు వేల పేజీల అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిలో గోటే పేరు చేర్చారు. మరికొంత మంది నిందితులను అరెస్టు చేసే అవకాశముందని సిట్ ప్రకటించింది. సిట్ దర్యాప్తు ప్రారంభమైన తర్వాత ఢిల్లీతో సహా పలు ప్రాంతాల్లో నకిలీస్టాంపుల పై పోలీసుల దాడులు ఊపందుకున్నాయి. పలు చోట్ల 'నకిలీ'లను స్వాధీన పర్చుకున్నారు. కర్నాటకలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న తెల్గీని తమకు అప్పగించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల లేఖలు రాసింది. వాటిని కర్నాటక కోర్టు త్రోసిపుచ్చింది. స్కామ్‌కు పాల్పడిన నిందితులు ఎక్కడ ఉన్నా ఏ స్థాయి వారైనా వదిలేది లేదని సిట్ అధికారి జైస్వాల్ అంటున్నారు. ●

చంద్రబాబు సర్కార్ దోషి

మహారాష్ట్ర పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న అంశాలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని దోషిని చేశాయి. బోనులో నిలబెట్టాయి. అధికారపార్టీని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఉత్పాతం నుండి ఏదోఒక విధంగా బయట పడటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పావులు కదుపుతున్నారు. విదేశాలకెళ్లి కూడా తన మంత్రివర్గ సహచరులతో సమాలోచనలు చేస్తున్నారు. నకిలీస్టాంపులు రాష్ట్రంలో చెలామణీ అవుతున్నట్లు ప్రభుత్వం వద్ద సమాచారం ఉంది. పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎందుకో వాటి జోలికి పోలేదు. తెలుగుదేశానికి చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యుడు కృష్ణయాదవ్‌ను మహారాష్ట్ర పోలీసులు ఈ నెల 6న వారెంట్‌తో వచ్చి అరెస్టు చేశారు. విచారణ కోసం పూనె తరలించారు. ఈ సంఘటన రాష్ట్రంలో సంచలనం కలిగించింది. అధికార పార్టీ 'అవినీతి' బండారాన్ని బహిర్గత పరిచింది. కుంభకోణంలో ప్రధాన నిందితుడు తెల్గీ ఇంటిపై ముంబయి పోలీసులు దాడి చేసిన సందర్భంలో కృష్ణయాదవ్ విషయం బయటికొచ్చింది. మంత్రిగా ఉన్న సమయంలో తెల్గీకి సహాయం చేయడానికి కృష్ణయాదవ్ రెండు కోట్లు డిమాండ్ చేసినట్లు ఆడియోటేపులో నిర్ధారణయింది. ముందు జాగ్రత్త చర్యగా ఆవతలి వ్యక్తుల మాటలను టేపు చేయడం తెల్గీ 'హాబీ'. ఇదే తెలుగుదేశం కొంప ముంచింది. టేపులో ఉన్న స్వరం యాదవ్‌దా కాదా అని నిర్ధారించడానికి ఈ ఏడాది ఏప్రిల్‌లో పూనె పోలీసులు ఆయన్ని తీసుకెళ్లారు. కొన్ని ప్రశ్నలడిగి పంపించారు. అంతటితో సమస్య సమసిపోయిందనుకున్న కృష్ణయాదవ్ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ముంబయి పోలీసులు యాదవ్ మాటలను రికార్డు చేసి పరీక్షల నిమిత్తం ఢిల్లీ పంపారు. టేపులో ఉన్న కంఠస్వరం కృష్ణయాదవ్‌దేనని నిర్ధారణయ్యాక వారెంట్‌తో హైదరాబాద్ వచ్చిన సిట్ బృందం ఆయన్ని అరెస్టు చేసింది. దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన వేల కోట్ల రూపాయల స్కామ్‌తో తెలుగుదేశం ఏ విధంగా పెనవేసుకుపోయిందో పుంఖానుపుంఖాలుగా పత్రికల్లో వెలువడుతున్న వార్తలతో చంద్రబాబు ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరైంది. మహారాష్ట్ర పోలీసులు నిందితుల కోసం ఇక్కడ గాలిస్తుండటం మరింత ఆందోళనకు గురిచేసింది. ఆరుగురు శాసనసభ్యులు, ఇద్దరు మంత్రులు, ఒక పార్లమెంటు సభ్యుడు తెల్గీతో సంబంధాలున్నట్లు ఆరోపణలెదుర్కొంటున్నారు. ముగ్గురు శాసనసభ్యులు తమకేపాపం తెలీదని పత్రికాముఖంగా ప్రకటించుకోవాల్సి వచ్చింది. వీళ్లుకాక మరో మాజీ మంత్రికి సంబంధమున్నట్లు తెల్గీ కంప్యూటరు వెల్లడించిందని వార్తలొస్తున్నాయి. గతంలో రాష్ట్రంలో నమోదైన నకిలీస్టాంపుల కేసులు చర్చనీయాంశమయ్యాయి. 1995 నుండి రాష్ట్రంలో నకిలీస్టాంపుల చెలామణి జరుగుతున్నట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. 1999 ఆగస్టు 5న హైదరాబాద్‌లోని బేగంబజారు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ప్రధాన నిందితుడు తెల్గీని అదే నెల 13న అరెస్టు చేశారు. స్వల్ప నేర తీవ్రత కలిగిన సెక్షన్లు నమోదు చేయడంతో సెప్టెంబర్ 29న తెల్గీకి కోర్టు బెయిలు మంజూరు చేసింది. అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెల్గీని అరెస్టు చేసింది మన పోలీసులే. నాలుగు నెలల పాటు నగర నేర పరిశోధన విభాగం ఈ కేసును విచారించి 41 మంది నిందితులను దశల వారీగా అరెస్టు చేసింది. డిసెంబరులో ఈ కేసు దర్యాప్తును సిఐడికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ తర్వాత ఏమైందో ఎవరికీ తెలీదు. ఇప్పటికీ ఛార్జిషీటు దాఖలు కాలేదు. 2000లో వైజాగ్‌లో తెల్గీపై కేసు నమోదైంది. ఇంకా ఛార్జిషీటు దాఖలు కాలేదు. కేసులు నమోదై నాలుగేళ్లవుతున్నా విచారణ ఎందుకు పూర్తి కాలేదనే ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సరైన సమాధానం లేదు. ప్రభుత్వంలోని కొంత మంది వ్యక్తుల పాత్ర ఉందనడానికి ఇది ఆస్కారం కలిగిస్తోంది. పలువురు పోలీసు అధికారులు తెల్గీకి సహకరించారని ఆరోపణలొచ్చాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు ముందు కృష్ణయాదవ్ అరెస్టు జరగడంతో ప్రభుత్వం ఇబ్బందుల్లో పడింది. ప్రతిపక్షాల దాడిని ఎదుర్కోడానికి చంద్రబాబు హడావుడిగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. నకిలీస్టాంపుల చెలామణిపై గతంలో కేంద్రానికి రాసిన లేఖలను పత్రికలకు విడుదల చేశారు. పలు రాష్ట్రాలతో సంబంధం ఉన్న ఈ కేసును సిబిఐతో దర్యాప్తు జరిపించాలని కేంద్రానికి విన్నవించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున ఈ కేసు నుండి బయట పడటానికి సిబిఐ దర్యాప్తు కోరుతున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అయితే కేంద్రం ఇప్పటి వరకు స్పందించలేదు. నిబంధనలన్నీ పూర్తి చేయకుండా నోటిమాటగా చంద్రబాబు సిబిఐ దర్యాప్తును కోరుతున్నారని విమర్శలొస్తున్నాయి. ఏ రాష్ట్రం కోరినా సిబిఐ దర్యాప్తుకు ఆదేశిస్తామని ఉప ప్రధాని అద్వానీ ప్రకటించారు. ఇదే సమయంలో తనకు తాను క్లీన్ చిట్ ఇచ్చుకునేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. సంస్కరణలు తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదంటూనే గ్లోబలైజేషన్ వల్ల ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని సూత్రీకరణలు చేస్తున్నారు. సిఐడి దర్యాప్తులో జాప్యంపై విచారణకు సీనియరు ఐపిఎస్ అధికారి కమలకుమార్‌ను నియమించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన నకిలీస్టాంపుల కేసులను విచారించడానికి కృష్ణరాజు నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. సిట్‌కు సంబంధించిన ఉత్తర్వులు ఇంకా వెలువడలేదు. అరెస్టయిన తమ పార్టీ ఎమ్మెల్యే కృష్ణయాదవ్‌ను పార్టీ నుండి బహిష్కరించారు. చట్టసభల నుండి నేరస్తులను వెలి వేయాలని పిలుపునిచ్చారు. నకిలీస్టాంపుల కేసుల దర్యాప్తులో జాప్యం ఎందుకో తెలీదు. ఇతకాలం కృష్ణయాదవ్‌తో సహచర్యం చేసి ఇప్పటికిప్పుడు ఆ అంశాలతో తనకు సంబంధం లేదని చెప్పడం ప్రతిపక్షాల విమర్శలకు కారణమైంది. కృష్ణయాదవ్ అరెస్టుతో రాష్ట్రంలో రాజకీయ వేడి పుంజుకుంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాయి. చంద్రబాబు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని రాష్ట్ర గవర్నర్‌కు కాంగ్రెస్ విన్నవించింది.

అమీబియాసిస్



మన దేశంలో నూటికి పదిహేను మంది అమీబియాసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమీబియాసిస్ బాధితులున్నారని ఒక అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థకు అందుతున్న లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 40,000 నుండి 1,00,000 మంది అమీబియాసిస్ దుష్పరిణామాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో అమీబియాసిస్ వ్యాప్తి చెందుతుంది. అందునా వర్ధమాన, పేద దేశాలలో ఎక్కువగా విజృంభిస్తున్నది.

అమీబియాసిస్ అంటే ఏమిటి ? ఎలా వస్తుంది ?

'ఎంటమీబా హిస్టోలైటికా' అనే ప్రొటోజోవల్ పరాన్నజీవి వలన మానవుల్లో కలిగే వ్యాధినే 'అమీబియాసిస్' అంటారు. ముఖ్యంగా ఈ పరాన్నజీవి మానవుని పెద్ద ప్రేవులలో 'సీకమ్' అనే భాగపు కుడ్యకందరాలలో తిష్టవేసి వ్యాధిని కలుగజేస్తున్నది. అంటే అమీబిక్ డయేరియా, డిసెంట్రీ (రక్తవిరోచనాలు)లకు కారణమవుతున్నది. మరికొందరిలో పరాన్నజీవి రక్తం ద్వారా, కాలేయం, ఊపిరితిత్తులు, మెదడును చేరి ఆయా అవయవాలలో 'అబ్సెస్'లకు దారితీస్తుంది.

ఎంటమీబా హిస్టోలైటికా పరాన్నజీవి రెండు దశలలో జీవిత చక్రం (లైఫ్ సైకిల్) పూర్తి చేసుకుంటుంది. ఈ దశలనే 'ట్రోఫోజోయిట్ దశ' 'సిస్టిక్ దశ'గా పేర్కొంటారు. వీటిలో సిస్టిక్ దశలో వున్న పరాన్న జీవులు వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నవి. ఈ దశలో వున్న పరాన్న జీవులు వ్యాధిగ్రస్థుల మలం ద్వారా విడుదల అవుతుంటాయి. వ్యాధిగ్రస్థుని మలం ద్వారా రోజుకు 1.5×10^{7} అమీబిక్ సిస్టులు విడుదల అవుతాయని లెక్కించడం జరిగింది. ఈ సిస్టులతో కూడిన మలంతో ఆహార పదార్థాలు, తాగునీరు



కలుషితం అవుతున్న కారణంగా, అమీబియాసిస్ ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుంది.

పరాన్నజీవి జీవిత చక్రం ఎలా ఉంటుంది? వ్యాధికి ఎలా కారణమవుతున్నది?

అమీబియాసిస్ కారక పరాన్నజీవి ఒకే జీవి (మానవుని)లో జీవితచక్రాన్ని ముగిస్తుంది. మలేరియా లేదా ఫైలేరియా కారక పరాన్నజీవుల లాగా, రెండు జీవులలో (మనిషి–దోమ) జీవిత చక్రం ఉండదు. ఇంతకుముందే ప్రస్తావించినట్లు సిస్టిక్ దశలోని మలం ద్వారా విసర్జించబడిన అమీబిక్ పరాన్నజీవి, కలుషిత ఆహారం, నీరు మొదలైన వాటి ద్వారా మరొకరి జీర్ణాశయంలో ప్రవేశిస్తుంది. జీర్ణాశయంలోని వివిధ ఎంజైములు, హైడ్రోక్లోరిక్ ఆమ్లము ఈ సిస్టులను నాశనం చేయలేవు. జీర్ణాశయం నుండి ఈ సిస్టులు ప్రేగుల ద్వారా ప్రయాణం మొదలు పెట్టి పరాన్న జీవులకు అనువైన స్థావరంగా ఎంచుకున్న పెద్దప్రేగులోని 'సీకమ్'ను చేరతాయి. అక్కడ పరాన్న జీవులు 'హిస్టోలైసిస్' అనే రసాయన పదార్థాన్ని ఉత్పత్తి చేసి సీకమ్ కుడ్యాలను కరిగించి అల్సర్‌లను ఏర్పరుస్తాయి.

ఈ అల్సర్‌లలో వివిధ పద్ధతులలో సంఖ్యాభివృద్ధి చెంది ట్రోఫోజెయిట్ స్టేజికి మార్పు చెందుతాయి. వీటివల్లనే అమీబియాసిస్ వ్యాధి బయటపడడం జరుగుతున్నది. ఈ పరాన్న జీవులు సీకమ్ కుడ్యాన్ని ఇంకా లోపలికి తొలుచుకుంటూ పోయి రక్తనాళాలను చేరతాయి. అంటే పరాన్న జీవులు రక్తప్రసరణ వ్యవస్థలో ప్రవేశించాయన్నమాట! ఈ సమయంలోనే పరాన్నజీవులున్న వ్యక్తులలో బంక విరోచనాలు, ఒక్కోసారి రక్తంతో కూడిన బంక విరోచనాలు కనబడుతుంటాయి. దీనినే 'అమీబిక్ డిసెంట్రీ' అంటారు. వీరిలో రోజుకి 4-6 సార్లు పెద్దగా విరోచనాలు అవ్వడం జరుగుతుంది. ఈ లక్షణాలు బయటపడడానికి పరాన్నజీవి శరీరంలో ప్రవేశించినప్పటి నుండి అయిదారు రోజుల నుండి 4 వారాల వరకు సమయం తీసుకుంటుంది. దీనినే ఇంక్యుబేషన్ పీరియడ్ అంటారు. అయితే పరాన్న జీవులు ప్రవేశించిన వారందరిలోనూ లక్షణాలు కనపడవు. కాని వీరి మలం నుండి వెలువడిన పరాన్న జీవులు మరొకరికి వ్యాధి లక్షణాలను కలుగచేయగలవు. ఇలా వ్యాధి లక్షణాలు కనబడకుండా, రోగాన్ని వ్యాప్తి చేసే వారినే 'కారియర్స్' అంటారు.

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

చిరునామా :

సంపాదకులు,
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్‌నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

కొందరిలో జీర్ణనాళ సంబంధ లక్షణాలు అంటే అమీబిక్ డిసెంట్రీ కనబడకుండానే, పరాన్న జీవులు రక్తం ద్వారా కాలేయాన్ని చేరి అక్కడ ప్రేగులోలానే, కాలేయ కణాలను నశింప చేసి, 'అబ్సిస్‌ను ఏర్పరుస్తాయి. జ్వరం రావడం, కొందరు కామెర్లకు గురి కావడం వంటి లక్షణాలు బయటపడతాయి. కాలేయం పెద్దదవుతుంది. రక్తాన్ని పరీక్షిస్తే, తెల్లరక్తకణాల సంఖ్య పెరిగి ఉంటుంది. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అబ్సిస్ పగిలి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడవచ్చు. ఇదే విధంగా రక్తం ద్వారా పరాన్న జీవులు ఊపిరితిత్తులలోను, మెదడులోను తిష్టవేసి ఆయా అవయవాలలో అబ్సిస్‌లను కల్గించవచ్చు. అయితే ఇది అరుదనే చెప్పాలి. కాని ప్రమాదకరమైనవి. పరాన్న జీవుల ద్వారా మళ్ళీ జీవితచక్రం జరుగుతూ ఉంటుంది. ఆయా దశలలో వ్యాధికి కారణమవుతూ ఉంటుంది.

ఎలా నిర్ధారించవచ్చు ?

అమీబిక్ డిసెంట్రీని లేదా ఇంటెస్టైనల్ అమీబియాసిస్‌ను వ్యాధిగ్రస్తుల మలాన్ని మైక్రోస్కోప్‌లో పరీక్షించి, సిస్టిక్, ట్రోపోజోయిట్ దశలో వున్న పరాన్న జీవులను గుర్తించడం ద్వారా నిర్ధారించవచ్చు. హెపాటిక్ అమీబియాసిస్ లేదా అమీబిక్ లివర్ అబ్సిస్‌ను నీడిల్ ద్వారా ఏస్పిరేట్ చేసి, దాన్ని మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించడం ద్వారాను, అల్ట్రా సౌండ్ స్కాన్ ద్వారాను నిర్ధారించవచ్చు.

అమీబిక్ లంగ్ అబ్సిస్‌ను లేదా ఊపిరితిత్తుల అమీబియాసిస్‌ను కళ్ళెను పరీక్షించడం ద్వారా, ఏస్పిరేట్ చేసి పరీక్షించడం ద్వారా, ఎక్స్‌రేల ద్వారా నిర్ధారించవచ్చు. మెదడులో అమీబిక్ అబ్సిస్‌ను సి.టి.స్కాన్, ఎమ్.ఆర్.ఐ.ల ద్వారా కనుగొనవచ్చు. ఈ అబ్సిస్‌లకు, రక్త విరోచనాలకు ఇంకా ఇతర సూక్ష్మజీవులు, బాక్టీరియా కూడా కారణమవుతాయి. కనుక చికిత్సకు ముందు వ్యాధి నిర్ధారణ తప్పనిసరి అవుతుంది.

చికిత్స ఏమిటి ? ఎలా నిరోధించవచ్చు ?

నేడు వివిధ దశలలోని, అవయవాలలోని అమీబియాసిస్‌కు అనేక అల్లోపతి మందులు లభ్యమవుతున్నాయి. వ్యాధి నిర్ధారణ కాకుండా ఈ మందులు ఎంత మాత్రం వాడకూడదు. వాడాల్సిన మందు, మోతాదు, కాలపరిమితి ఆయా వ్యాధి దశలను, వ్యక్తి బరువును బట్టి ఆధారపడి ఉంటాయి. ఏ దశలోని అమీబియాసిస్‌ను అయినా పూర్తిగా నయం చేయవచ్చు. అయితే కాలేయం, ఊపిరితిత్తులు, మెదడులలో అబ్సిస్‌లను ప్రత్యేక సిరంజిలతో ఏస్పిరేట్ చేయడం ద్వారా గాని, శస్త్రచికిత్స ద్వారా గాని తొలగించాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యం చేస్తే అబ్సిస్ రప్చర్ అయ్యే ప్రమాదం వుంది. ఏదిఏమైనా వ్యాధి సోకిందేమోనన్న అనుమానం వున్న వారు వైద్యుని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం మంచిది. పుస్తకాల్లో చదివిన పరిజ్ఞానంతో లక్షణాలను బట్టి మందులు స్వంతంగా వాడడం ఎంతో ప్రమాదకరం అన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలి.

ఇక వ్యాధి నిరోధం విషయానికి వస్తే ముందుగా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత విషయంలో అత్యంత ప్రాధాన్యత అవసరమవుతుంది. ముఖ్యంగా మానవ మలంతో ఆహారం మంచినీరు, కలుషితం కాకుండా చూసుకోవాలి. ఆహార పదార్థాల పాత్రలపై మూతలు పెట్టి ఉంచడం, వేడి పదార్థాలు భుజించడం చేయాలి. క్లోరిన్ వల్ల నీటిలోని పరాన్న జీవి సిస్టులు నశించవు. కావున నీటిని కనీసం వర్షాకాలంలోనయినా కాచి చల్లార్చి తాగడం గాని లేదా నాణ్యమైన ఫిల్టర్స్‌ను ఉపయోగించడం గాని చేయాలి.

ఆహార పదార్థాలు తీసుకోబోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి గోళ్ళను పెంచకూడదు. గోళ్ళ సందుల్లో సిస్టులు ఇరుక్కుపోయి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ 1859లోనే అమీబియాసిస్‌కు కారణమవుతున్న పరాన్నజీవి జీవిత చరిత్రంతా తెలుసుకున్నా నేటికీ, వ్యాధిని నిర్మూలించకపోవడానికి కారణం మానవుని నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదు.

(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)

పసికందుల కళ్ళు పుసులు కడుతుంటే...

– డాక్టర్ ఎం.రవికుమార్, ఎమ్.ఎస్.

కళ్ళుంటేనే కలియుగమంటారు. ఇది అక్షర సత్యమని అందరూ అంగీకరించే విషయమే. దురదృష్టవశాత్తు పుట్టిన నెలల వ్యవధిలోనే పసికందులలో శాశ్వత అంధత్వాన్ని ఆపాదించే వాటిలో సూక్ష్మజీవులు కలిగించే వ్యాధులే ప్రధాన కారణభూతాలవుతున్నాయి. ఏటా పసి వయస్సులోనే దృష్టిని దూరం చేసుకునే అభాగ్య శిశువుల సంఖ్య మన దేశంలో తక్కువేమీ కాదు. సాధారణంగా బిడ్డపుట్టిన మొదటి మూడు, నాలుగు వారాల వరకు కళ్ళ నుంచి ఎలాంటి ద్రవాలు స్రవించవు. ఈ వ్యవధిలో పసి పిల్లలు ఎంత ఏడ్చినా కన్నీళ్ళు కారకపోవడం మనం అనుభవంలో గమనించే విషయమే. మూడు నాలుగు వారాల వరకు శిశువులలో కన్నీటిని స్రవించే గ్రంథులు అభివృద్ధి చెందకపోవడమే ఇందుకు కారణం. ఈ వ్యవధిలో కళ్ళలోంచి ఏ విధమైన ద్రవాలు కనిపించినా, అది కంటి వ్యాధి లక్షణంగానే భావించాలి. సాధారణంగా బిడ్డపుట్టిన వారంలో వచ్చే వ్యాధులలో బాక్టీరియా వల్ల వ్యాపించే ఆప్తాల్మియా నియోనేటారం ప్రధానమైనది. ఇది ప్రమాదకరమైనది కూడా. ఈ వ్యాధి ప్రసవ సమయంలో గాని, తర్వాత తగిన పరిశుభ్రత పాటించడంలో అశ్రద్ధ వల్లగాని, ఒక్కోసారి దుస్తులు, బెడ్‌షీట్ల వల్ల కూడా బిడ్డకు సోకవచ్చు.

శిశువు పుట్టిన మొదటి వారంలోనే సాధారణంగా ఈ వ్యాధికి గురవుతుంటారు. కళ్ళు ఎర్రబడటం, ఎక్కువగా పుసులు కట్టడం, కనుగుడ్లు, కనురెప్పలు వాయడం, అతుక్కుపోవడం, వెలుతురును చూడలేక పోవడం, మెడదగ్గర వుండే లింప్ గ్రంధి వాయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా రెండు కళ్ళు, ఒక్కోసారి ఒక కన్నే వ్యాధికి గురికావచ్చు. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే పూర్తి అంధత్వానికి దారితీస్తుంది. అంతేకాక కనుగుడ్డు లోపలికి పీక్కుపోయి ముఖం వికారంగా తయారవుతుంది. అతి తక్కువ సమయంలోనే పూర్తిగా నివారించగలిగే ఈ వ్యాధి మూఢనమ్మకాలతో ఎలాంటి నాటు వైద్య పద్ధతులు అవలంబించినా, వ్యాధి తగ్గకపోగా మరింత ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. ఒక్కొక్కప్పుడు వ్యాధి జీర్ణాశయానికి, కీళ్ళకు కూడా వ్యాపించవచ్చు. చిన్న వయస్సులోనే శుక్లాలకు దారితీయవచ్చు. ఈ వ్యాధి వచ్చినపుడు కంటికి కట్టుకట్టకూడదు. దీనివల్ల వ్యాధి మరింత ఉధృతం అవుతుంది.

ఏది ఏమైనా పసిపిల్లల్లో కళ్ళకు సంబంధించి ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుని సంప్రదించడం ఎంతైనా శ్రేయస్కరం. కేవలం ఒకటి రెండు రోజుల్లోనే వ్యాధిని మాన్పించి, పసికందు కళ్ళను కాపాడే మందులు నేటి వైద్యశాస్త్రంలో వున్నాయి. అసలు ముందుజాగ్రత్తగా ప్రసవ సమయంలో తగిన పరిశుభ్రత పాటించడం చాలా అవసరం.

✻ అంపశయ్య నవీన్

సంస్కృతి నాశనం అయ్యేది కాదు



రామారావు, లక్ష్మణరావు ఓ పెళ్ళిలో కలుసుకున్నారు. బాగా డబ్బున్న వాళ్ళ పెళ్ళి కావడంతో ఊర్లో వున్న ప్రముఖులంతా ఆ పెళ్ళికొచ్చారు. కళ్యాణ వేదిక మీద పెళ్ళి జరుగుతోంది. వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు వధూవరుల చుట్టూ చేరడంతో మ్యారేజ్ హాల్లో కూర్చున్న వాళ్ళకెవరికీ ఆ పెళ్ళిని చూసే అవకాశమే లేదు. అందరూ కబుర్లలో పడిపోయి అనేక జాతీయ, అంతర్జాతీయ సమస్యల్ని గూర్చి చర్చించడం మొదలెట్టారు.

"మన సంస్కృతి నాశనమైపోతున్నదోయ్" అన్నాడు రామారావు.

"ఎందువల్ల అలా జరుగుతున్నదంటారు?" అన్నాడు లక్ష్మణరావు.

"ఎందువల్ల అని అంత అమాయకంగా అడుగుతారేమిటి? ఇవ్వాళ్ళ ప్రతి ఇంట్లో కేబుల్ కనెక్షన్ ఉన్న టీవీలు – లెక్కలేనన్ని ఫారెన్ ఛానల్స్... ఈ ఫారెన్ ఛానల్స్‌లో వస్తున్న ప్రోగ్రామ్స్‌ను మీరెప్పుడన్నా చూశారా? సెక్సీ డాన్స్‌లు... వయలెన్స్.... క్రైమ్... ఇవి తప్ప ఇంకేమైనా చూపిస్తున్నారనుకుంటున్నారా ? వీటిని చూస్తున్న మన యువతరం ఎంత చెడిపోతున్నారో గమనిస్తున్నారా?"

"ఫారెన్ ఛానల్స్ వల్ల మన సంస్కృతి చెడిపోతున్నదనుకుంటే వాటిని పెట్టుకోకుండా ఉండొచ్చుకదా.. అసలు కేబుల్ కనెక్షన్ తీసుకోకపోతే సమస్యే ఉండదు కదా..."

"పక్కనే స్కాచ్ విస్కీ బాటిల్ పెట్టి తాగొద్దంటే ఎవరూరుకుంటారండీ? మన ప్రభుత్వం ఏం చేస్తున్నది? ఫారెన్ ఛానల్స్‌నన్నింటినీ బంద్ చేసి పారెయ్యాలి."

"మనది ప్రజాస్వామ్యదేశం కదా... మీకిష్టం లేనంత మాత్రాన ఫారెన్ ఛానల్స్ ఇష్టపడేవారు ఎవరూ లేరనుకుంటున్నారా? వాళ్ళ స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు మనకెక్కడిది?..."

"ఏమిటండి మీరు? ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు... ఓ పక్క అవతల కొంపలంటుకుపోతుంటే!"

"ఎవరి కొంపలంటుకుపోతున్నాయంటారు?"

"మన కొంపలే అంటుకుపోతున్నాయి. ఆ విషయం మనకు తెలియడం లేదు... చాపకింద నీరులా విదేశీ సంస్కృతి... ముఖ్యంగా అమెరికా వాడి సంస్కృతి మన దేశంలోకి వ్యాపిస్తున్నది... మన సంస్కృతి, మన సంప్రదాయాలు, మన ఆచార వ్యవహారాలు... ఒక్క మాటలో చెప్పాలంటే మన జీవన విధానమే మంటగలిసిపోతున్నాయి... ఇది అమెరికా వాడి సాంస్కృతిక దాడి... అమెరికా వాడి సాంస్కృతిక సామ్రాజ్యాన్ని ప్రపంచమంతటికీ విస్తరిస్తున్నాడు... ఇదంతా సామ్రాజ్యవాదుల కుట్ర!"

"ఇంత పెద్ద కుట్ర జరుగుతున్నదని నాకు తెలీదు... అయినా మన సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్ద ప్రమాదమొచ్చిందని నాకనిపించడం లేదు...."

"ఎందుకనిపిస్తుందీ? మీరూ ఫారెన్ టీవీ ఛానళ్ళ మోజులో పడిపోయినట్టున్నారు..."

"ఇప్పుడు జరుగుతున్న ఈ పెళ్ళినే చూడండి... సంప్రదాయ బద్ధంగా జరగడం లేదూ?"

"ముందు ముందు మన వాళ్ళ పెళ్ళిళ్ళు ఇలా జరగవండీ! మన పిల్లలు ఏ 'డిస్కోథెక్స్'లోనో, ఏ ఫైవ్‌స్టార్ హోటల్స్‌లోనో తప్ప ఇట్లా సంప్రదాయబద్ధంగా పెళ్ళిళ్ళు చేసుకోరు... ఇంకో పదేళ్ళలో పరిస్థితి పూర్తిగా మారిపోతుంది.. ఇదంతా గ్లోబలైజేషన్ ప్రభావమండీ! ఎక్కడ చూసినా ఫారెన్ సరుకులే... మన వాళ్ళల్లో 'కన్స్యూమరిజమ్' బాగా పెరిగిపోతున్నది. ఫారెన్‌గూడ్స్ మోజులో పడిపోయి మనం మన సంస్కృతిని మరచిపోతున్నాం. మన వేషభాషలు మరచిపోతున్నాం. ఈ గ్లోబలైజేషన్, ఈ మార్కెటైజేషన్, ఈ లిబరలైజేషన్ లాంటివొచ్చి మన సంస్కృతిని పూర్తిగా నాశనం చేస్తున్నాయి..."

"గ్లోబలైజేషన్‌కూ, మన సంస్కృతికీ ఏం సంబంధమో నాకర్థం కావడం లేదు..."

"ఇంత చిన్న విషయం మీకర్థం కావడం లేదా? గ్లోబలైజేషన్ వల్లనే కదా... ఎక్కడెక్కడో తయారైన అడ్డమైన వస్తువులన్నీ మన దేశానికొస్తున్నాయి. మనమంతా వాటి మోజులో పడిపోయి మన దేశంలో తయారైన వస్తువుల్ని చీదరించుకుంటున్నాం..."

"మన దేశంలో తయారైన వస్తువులు విదేశాలకిప్పుడు విరివిగా వెళ్తున్నాయన్న విషయం మీకు తెలుసా? గ్లోబలైజేషన్ కారణంగా మన ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. అసలు మీకోసంగతి తెలుసా?"

"ఏ సంగతి?"

"గ్లోబలైజేషన్, మార్కెటైజేషన్ లాంటివి వచ్చాకే మన దేశం బాగా అభివృద్ధి చెందిదంటున్నారు. మన దేశంలో 1980ల వరకు వృద్ధిరేటు మూడునాలుగు శాతాన్ని మించలేదు. అదే 1991 నుండి 2001 మధ్యలో మన వృద్ధిరేటు ఏడెనిమిది శాతానికి పెరిగింది. ఈ టైమ్‌లోనే మన దేశపు మిడిల్ క్లాస్ బాగా విస్తరించింది. ఒకప్పుడు బాగా డబ్బున్న వాళ్ళకు మాత్రమే లభ్యమయ్యే కార్లు, ఫ్రిజ్‌లు, కలర్ టీవీలు, సీడీప్లేయర్స్ లాంటివి ఇప్పుడు మిడిల్ క్లాసు వాళ్ళకూడా లభ్యమవుతున్నాయి.... పేదరికం క్రమంగా తగ్గుముఖం పడుతున్నది"

"నాకు కాకిలెక్కలు చెప్పకండి. మీరు చెప్పినవన్నీ అభివృద్ధి అనుకుంటే చాలా పొరపాటు.. అసలు ఒక జాతికి ఆయువు పట్టయిన సంస్కృతి పోతున్నదండీ.. సంప్రదాయాలు పోతున్నాయండీ. ఇదెంత ప్రమాదమో మనం గుర్తించడం లేదు... మన యువతరం అమెరికా మానస పుత్రులుగా మారిపోతున్నారండీ.. దిసీజ్ వెరీవెరీ డేంజరస్. దిసీజ్ కల్చరల్ స్లేవరీ."

"ఏ సంస్కృతైనా కాలాన్ని బట్టి కొంత మారుతుందండీ... కానీ ఒక జాతి సంస్కృతిలోని కొన్ని మౌలికాంశాలు మాత్రం మారవు... మీరన్న ఫారెన్ టీవీ ఛానళ్ళ వల్ల మన సంస్కృతిలోని మౌలికాంశాలకొచ్చిన ప్రమాదమేమీ లేదు... వాటివల్ల వచ్చే మార్పు పైపైన మాత్రమే ఉంటుంది తప్ప అసలు మూలాన్ని మార్చేంతగా ఉండదు. టీవీ ఛానళ్ళ తాకిడికే మారిపోయే సంస్కృతి ఏం సంస్కృతండీ? అలా మారిపోతే ఆ సంస్కృతిలో అసలు బలమేలేదన్నమాట! మన భారతీయ సంస్కృతి అంత బలహీనమైందని నేననుకోను."

అక్షింతలు వేసే టైమ్ రావడంతో వాళ్ళ వాదన అంతటితో ముగిసింది. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత లక్ష్మణరావు, రామారావు ఇంటికి వెళ్ళాడు. ఇదివరకటి రామారావింటికీ, ఇప్పటి రామారావింటికీ పోలికే లేదు. ఇంటిని రెనొవేట్ చేశాడు. ఇంటిముందు పోర్టికోలో 'సాంట్రో' కారు ఆగి ఉంది. డ్రాయింగ్‌రూం నిండా ఫారెన్ పెయింటర్స్ వేసిన ఆయిల్ పెయింటింగ్స్ కనిపించాయి. ఇటాలియన్ మార్బుల్స్‌తో మలచబడిన నగ్న సుందరీమణుల బొమ్మలు కనిపించాయి.

"ఏమిటిదంతా? మన సంస్కృతేనా?" అడిగాడు లక్ష్మణరావు.

"ఇవన్నీ మా పెద్దబ్బాయి అమెరికా నుండి పంపించాడండీ. చాలా అద్భుతంగా వున్నాయికదండీ" అన్నాడు రామారావు. ●

మద్యంపై ఉద్యమం

మునిగినవాడు తేలేందుకు వాగ్దానం
తేలినవాడు ఏలేందుకు వాగ్దానం
వాగ్దానం పైరగాలై వీస్తుంది
పడమటి గాలై ముగుస్తుంది!
మొదట మద్యం ఏరులైపారి
ఆపై జీవనదులై పుణ్యభూమి
పరీవాహక ప్రాంతం ముంచుతుంది
చిన్న సన్నకారు ఆర్థిక స్థితి నిమజ్జనం
ఉద్యమాలు మొలకెత్తి ఊరూరా వ్యాపించి
రాజధాని ముట్టడించి
అంతర్జాతీయ దృష్టి ఆకర్షిస్తాయి
అట్టుడికిన ఉద్యమాల మధ్య
దైవాంశ సంభూతుడు ఉద్భవించి
మద్యనిషేధ సమ్మోహనాస్త్రం విడుస్తాడు
వాగ్దానం పదవిని ముట్టడించి ఆక్రమిస్తుంది
సంఘాతుణ్ణి అధినాయకుణ్ణి చేస్తుంది!
అటు సూర్యుడు ఇటూ
ఇటు సూర్యుడు అటూ కదలి
కాలం కునుకు తీస్తుంది
ఐదేళ్ళ పదవి పట్టా అంతఃపురాన భద్రపరిచి
వాగ్దానం కొండెక్కుతుంది
కష్టాలన్నీ కలసి అప్పుడే ప్రారంభం!
ప్రాజెక్టులుండవు పనులుండవు
జీతాలుండవు చెల్లింపులుండవు
ఒక రూపాయి రాకడ
వెయ్యి రూపాయలు పోకడ
కోశాగారంపై శ్వేతపత్రం విడుదల!
సభలు సమావేశాలు
చర్చలు ఫలితాలు
మద్య నిషేధం ఎత్తివేత వినా
మరో మార్గం లేని ఎత్తుగడ ప్రకటనలు!
ప్రపంచ బ్యాంకు వైపు పరుగులు
ఐ.ఎమ్.ఎఫ్.వైపు ఉరుకులు
మళ్ళీ మద్యం ఏరులై ప్రవాహం
లోతట్టుతో పాటు మెట్ట ప్రాంతాలు మునక!
ఇప్పుడు మద్యంపై ఉద్యమం
మళ్ళీ వాకిట నిలిచిన దృశ్యం!

- అడిగోపుల వెంకటరత్నమ్

సామూహిక భయం



నగర నగరాన నరమేధం
భరతమాత నరనరాన
బాంబుల విస్ఫోటనం
ఇది మతోన్మాదం రచిస్తున్న మరణగీతం
ఉగ్రవాదం వినిపిస్తున్న విషాద గీతం

మనం మనం ఒకటిగా
భాయి భాయనే జాతీయ భావాన్ని
చెదర గొట్టడమే మతోన్మాదుల ధ్యేయం

ఒకేతాటిపై నడుస్తున్న
ఐక్యతా భావాన్ని
ఇండియా-పాకిస్తాన్లుగా విడగొడతారు
ఇద్దరు వ్యక్తుల మధ్య
సరిహద్దు ఉద్రిక్తతలను సృష్టిస్తారు
అందరిలో అభద్రతా భావాన్ని కలిగిస్తారు

'గ్లామర్ సిటి' మీదున్న మోజుతో
రెక్కలు విప్పుకున్న స్వప్నాలు
ఘాట్కోపర్ బస్సు బాంబు పేలుళ్ళతో
శిధిల శకలాలై కుప్పకూలిపోతాయి
'గేట్ వే ఆఫ్ ఇండియా' వద్ద
రక్తపు ముద్దలై మిగిలిపోతాయి.

నెరవేరని ఆశల్ని
ఆవిష్కరించుకుందామని
రైలెక్కినోళ్ళు
ములుండు రైల్వేస్టేషన్లో
ముక్కలు ముక్కలైన మృతదేహాలు
మూటలు మూటలుగా తిరిగొస్తాయి.

నిజంగా ఇప్పుడు
ఒంటరితనం కంటే
సామూహికమే భయం గొలుపుతుంది

- సంగిపాగి ఆనందరాజు

✻ వి.ఆర్.వాగోలు

"నోరు తెరిస్తే చాలు మా కళ్యాణ్‌కు అబద్ధాలే వస్తున్నాయిరా" అన్నాడు గోపీ విజయ్‌తో. "చిన్న పిల్లలన్న తరువాత అబద్ధాలు చెప్పకుండా ఎలా ఉంటార్రా. మనం మాత్రం అబద్ధాలు చెప్పడం లేదూ" అన్నాడు విజయ్. "మనం మాట్లాడామంటే ఒక అర్థం ఉంది. పిల్లలు కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా రా?" అన్నాడు గోపి.

పిల్లల్లో అబద్ధాలు - పెద్దల పాత్ర



"బీరువాలో పెట్టిన డబ్బులు తీశావా లేదా చెప్పు, చెప్పకపోయావో దెబ్బలు పడతాయి' అంది జ్యోత్స్న వాళ్ళ మమ్మీ. "నిజం మమ్మీ నేనుతీయలేదు" అని సమాధానమిచ్చింది జ్యోత్స్న. "చెబుతావా లేదా" అని కర్ర చేతిలోకి తీసుకోగానే "నేనే తీశాను మమ్మీ నన్నుకొట్టవద్దు" అంటూ ఏడుపు ముఖం పెట్టింది జ్యోత్స్న.

"మాస్టారండీ లక్ష్మి పుస్తకం తీసింది" అంటూ కొందరు మాస్టారికి ఫిర్యాదు చేశారు. దాంతో "ఏం లక్ష్మీ నువ్వు పుస్తకం తీశావా" అనడగడంతో "నేను తీయలేదండీ" అని బుకాయించింది. అయితే పిల్లలు "కాదండీ, లక్ష్మి తీయడం మేం చూశాం" అనడంతో మాస్టారు కోపంతో 'నిజం చెప్పు ఆ పుస్తకం తీశావా లేదా' అని అడగడంతో 'నేనే తీశానండీ' అని ఏడుస్తూ చెప్పింది లక్ష్మి.

"సరళా ఓ కప్పు పంచదార ఉంటే ఇవ్వవూ" అనడిగింది పక్కింటి తరుణి. "లేదండీ నిన్ననే అయిపోయింది ఉంటే ఇచ్చేదాన్నే'' అని సమాధానమిచ్చింది సరళ. తరుణి అలా వెళ్ళగానే "అదేంటి మమ్మీ నిన్ననేగా ఇంట్లోకి సరుకులు తీసుకువచ్చింది. మన ఇంట్లో పంచదార ఉన్నా లేదని చెప్పావేమిటి ఆంటీకి" అంది సరళ కూతురు పద్మ. "నీకు బుద్ధుందా అయినా పెద్దవాళ్ళ సంగతి నీకెందుకు? మాట్లాడకుండా ఉండు" అని గద్దించింది సరళ. దానితో పద్మ 'నువ్వేగా మమ్మీ అబద్ధం చెప్పకూడదని నాకు చెప్పావు" ఏడుస్తూ.

"మోహన్! అర్జంటు పని ఉంది. నీ బండి ఇస్తావా కావాలి" అనడిగాడు అరుణ్. "సారీరా, బండి కొద్దిగా ట్రబులిచ్చింది. బండి బాగుంటే ఇచ్చే వాడినే. ఏమీ అనుకోకు" అంటూ సమాధానమిచ్చాడు మోహన్. "సరే పర్వాలేదులే" అంటూ వెళ్ళిపోయాడు అరుణ్. 'మన బండి బాగానే ఉందిగా డాడీ. అంకుల్‌కు అబద్ధం ఎందుకు చెప్పావు' అని కొడుకు అడగడంతో మోహన్ నోటివెంట మాట రాలేదు. వెంటనే తేరుకుని "నీకు తెలియదులే కాని నీవెళ్ళి ఆడుకో" అని కొడుకును బయటకు పంపించాడు. అయితే ఆ చిన్నారికి గాని, సరళ కూతురు పద్మకు గాని ఒక విషయం అర్థం కాలేదు. తమను అబద్ధం ఆడకూడదంటూ చెప్పిన వారే అబద్ధాలు ఆడటం ఎందుకు ?

సాధారణంగా మన పిల్లలు అబద్ధాలు చెప్పకూడదని, ఎప్పుడూ నిజమే మాట్లాడాలని తల్లిదండ్రులు భావిస్తుంటారు. అందులో తప్పులేదు. అయితే తల్లిదండ్రులు కోరుకున్నట్లుగా చిన్నారులు నిజాలు మాట్లాడరు సరికదా ప్రతిచిన్న విషయానికీ అబద్ధాలు చెబుతుంటారు. వాటిని కప్పిపుచ్చుకునేందుకుగానూ మరికొన్ని అబద్ధాలు ఆడుతుంటారు. బాలల్లో జీవితాల్లో పరిశీలనకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్న విషయం మనం మరచిపోకూడదు. పిల్లలు ప్రతి విషయాన్నీ పట్టించుకుంటారు.

పెద్దలు తమకు తెలియకుండానే అన్యోపదేశంగా పసివాళ్ళ ముందే అబద్ధాలు చెప్పటం చూస్తుంటాం. కాని పిల్లల నుండి మాత్రం అబద్ధాలు రాకూడదని ఆశిస్తారు. తమకు చెప్పిన పెద్దలే తాము మాత్రం అబద్ధాలు ఆడటం ఎంతవరకు సబబు అని పిల్లలు ప్రశ్నించుకుంటారు. కొంతమంది పిల్లలు అదే విషయం పెద్దలనడిగినా కొందరు పిల్లలు అడగలేరు. పెద్దలు అబద్ధాలాడటం పసిమనసులపై కొంత ప్రభావాన్ని చూపిస్తుంది. పెద్దవారే అబద్ధాలాడుతున్నపుడు తాము ఎందుకు ఆడకూడదని ఆలోచిస్తారు.

అసలు పిల్లలు అలా ఎందుకుంటారనే విషయం పరిశీలిస్తే బాలలు ఏదైనా పని చేసినపుడు అది ఇతరులకు, పెద్దలకు నచ్చనపుడు తాము ఆ పని చేసినట్లు చెప్పటానికి వారు సందేహిస్తారు. ఉన్న విషయం చెబితే వారి కోపానికి, ఆగ్రహానికి గురికాక తప్పదని భావిస్తారు. దానితో విషయం మార్చి చెప్పేందుకు ప్రయత్నిస్తారు. అది క్రమంగా ఒక అలవాటుగా మారుతుంది. చిన్నారులలో అబద్ధాలకు మూలకారణంగా దీన్నీ చెప్పవచ్చు. బాలలు తమకు నచ్చిన పని చేసేందుకు ఏ మాత్రం వెనుకాడరు. అయితే వారు చేసే పని వల్ల కలిగే ఫలితం గూర్చి వారికి అవగాహన ఉండదు. తాము చేసిన పని ఇతరులకు ఇబ్బంది కలిగించిందని, వారి కోపానికి కారణమయిందని తెలుసుకొన్నప్పుడు దాని నుండి తప్పించుకోవడానికి గానూ అసలు విషయం దాచిపెట్టే ప్రయత్నం చేస్తారు.

పిల్లల్లో అబద్ధాలకు రకరకాల అంశాలు కారణమైనా పెద్దలు వాటిని మాన్పించే ప్రయత్నం సున్నితంగా చేయాలి. దానితో పాటు పిల్లలు అలా ప్రవర్తించడానికి తామేమైనా కారణమవుతున్నామా అనే అంశం కూడా పరిశీలించాలి. లేకపోతే పిల్లలు అబద్ధాలు చెప్పడానికి ఇల్లే కేంద్రస్థానమవుతుందనే విషయం మరువరాదు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లకు నమూనాలుగా నిలవాలి. పిల్లలు ప్రతి చిన్న విషయానికీ తల్లిదండ్రులపైనే ఆధారపడుతుంటారు. అందువల్ల తల్లిదండ్రుల నుండి పిల్లలకు చెడు సంకేతాలందకూడదు. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తాము మాత్రం తమ చిన్నారుల ముందే వారికి తెలిసేటట్లు అబద్ధాలాడుతూ తమ పిల్లలు అబద్ధాలు ఆడకూడదని ఆశించడం అత్యాశే అవుతుంది. కనుక పిల్లలు అబద్ధాలు చెప్పే అలవాటులో పెద్దల పాత్ర ఉంటుందనడంలో సందేహం లేదు. ●

చిన్న చూపు

* అమ్మిన శ్రీనివాసరాజు

రమణమ్మగారి వంటగదిలో రకరకాల పాత్రలుండేవి. అందులో ఒక మట్టికుండ కూడా వుండేది. పక్కనే వున్న స్టీలు బిందెకు మట్టికుండ అంటే ఎంత చిన్న చూపో! ఎప్పుడూ దానివంక ఎగతాళిగా, వెటకారంగా చూసి నవ్వుతుండేది. అంతేకాక మిగతా పాత్రలకుకూడా మట్టికుండ గురించి చులకనగా చెబుతూ నవ్విస్తుండేది.

ఒకరోజు మట్టి కుండవైపు తిరిగి 'ఏయ్! పొరపాటునకూడా నన్ను ముట్టుకోకు. నేనుగాని నీ మీద పడ్డానంటే నీ పని ఫట్!' అంటూ వెక్కిరించింది స్టీలుబిందె. 'అలాగే...! అంటూ వినయంగా జవాబు చెప్పింది మట్టికుండ.

అప్పుడుకూడా 'నువ్వు పిరికి పందవి' అంటూ మట్టికుండను చీదరించుకుంది స్టీలు బిందె.

'చూడు మిత్రమా! మనం ఇలా ఒకరినొకరం చీదరించుకోవడంకాదు. మనుషులు మనలో వుంచిన వాటిని జాగ్రత్త చేయడం మన పని. మనం చేసే పనిలో ఇద్దరం సమానమే. ఎవరూ ఎక్కువకాదు. తక్కువకాదు' అంటూ నిదానంగా సమాధానం చెప్పింది మట్టికుండ.

'నోర్ముయ్! నువ్వూ నేనూ ఒక్కటే అని చెప్పడానికి నీకు ఎంత ధైర్యం? నేను ఒక్క గుద్దు గుద్దానంటే ముక్కలైపోతావు. నీ నామరూపాలు కూడా వుండవు. నేను అలా కాదు. నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఎప్పటికీ ఇలాగే బలంగా వుంటాను తెలుసా?' అంది గర్వంగా.

'మనం కలసి మెలసి వుండాలికాని ఇలా గొడవలు పడడం బాగోదు' అని శాంతపరచబోయింది మట్టికుండ.

'ఛీ... ఛీ... నీ పక్కన వుండడమే సిగ్గుచేటు. నీకూ నాకూ పోలికా! నువ్వెక్కడ నేనెక్కడ? నువ్వు కొద్ది రోజుల్లోనే ముక్కలు ముక్కలై పనికి రాకుండాపోతావు. నేను ఎప్పటికీ ఇలాగే వుంటాను' అంటూ గేలిచేసింది స్టీలుబిందె. ఇక మట్టికుండ మారుమాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

ఇలా చాలా రోజులు గడిచాయి. ఒక రోజు రమణమ్మ స్టీలుబిందె తీసుకుని బావి దగ్గరకెళ్లింది. బిందెనిండా నీళ్లు నింపుకుని చంకలో పెట్టుకుని వస్తుంటే కాలికి రాయి తగిలింది. దాంతో దభీమని కింద పడిపోయింది. నీళ్లన్నీ ఒలికిపోయాయి. అంతేకాక భూమికి బలంగా కొట్టుకోవడం వలన బిందెకు చొట్టలు పడ్డాయి. చూడడానికి భయంకరంగా తయారైంది. చొట్టలు తీసి బిందెను బాగు చేద్దామని రమణమ్మ చిన్న రాయి తీసుకుని కొట్టడం మొదలెట్టింది. ఆ దెబ్బలు భరించలేక బిందె ఏడ్చింది. అయినా చొట్టలు పోయేవరకు రమణమ్మ అలా కొడుతూనే వుంది.

ఎలాగైతేనేం... చొట్టలు పోయాయి. కానీ రంధ్రాలు పడ్డాయి. చిల్లులు పడిన పాత్రలకు మాట్లు వేసే అబ్బాయికి బిందెను చూపించింది. అతను బిందె అడుగు తీసి అడుగు వేయాల్సిందేనన్నాడు. అలా చేయడానికి పెద్దమొత్తంలో డబ్బులు అడిగాడు. 'అడుగు వేయడానికే అన్ని డబ్బులు ఇవ్వాలా!' అనుకున్న రమణమ్మ స్టీలు బిందెను తిట్టుకుంటూ పాత సామాన్ల గదిలో విసిరికొట్టింది. అంతేకాక మంచినీళ్ల తెచ్చుకోవడానికి గదిలో బోర్లించిన మట్టికుండను జాగ్రత్తగా బైటకు తీసింది.

నీళ్లు నిండిన మట్టికుండను చూసి చిల్లులు పడ్డ స్టీలుబిందెకు తల తీసేసినట్టైంది. 'నేనే శాశ్వతం... నేను ఎప్పటికీ ఇలాగే వుంటాను' అని ఇదివరకు కుండతో తానన్న మాటలు గుర్తుకు వచ్చాయి. ఎప్పుడూ ఇతరుల పట్ల చిన్నచూపు చూడకూడదని స్టీలు బిందెకు అప్పుడు అర్థమైంది. మట్టి కుండకు తన చిల్లుల మోహం చూపించలేకపోయింది.

తప్పు తెలుసుకుని బాధపడుతున్న స్టీలు బిందె వంక జాలిగా చూసింది మట్టికుండ.



క్విజ్-75

1. భారత రాజ్యాంగం గుర్తించిన భాషలు?
   ఎ.15 బి. 14
2. 'హర్ష చరిత్ర' రచయిత ఎవరు?
   ఎ.విష్ణుశర్మ బి. బాణభట్టు
3. భూమి ఒక చిన్న గ్రహం అని చెప్పినది?
   ఎ. కోపర్నికస్ బి. కెప్టెన్‌కుక్
4. గురుత్వాకర్షణ సిద్ధాంతము కనిపెట్టినది?
   ఎ.న్యూటన్ బి. ఎడిసన్
5. మన జాతీయ పుష్పం?
   ఎ. తామర బి. గులాబీ
6. బంగారం స్వచ్ఛతను తెలిపేది?
   ఎ.కేరట్ బి.కేలరీ
7. పెద్ద ఖండం?
   ఎ.ఆస్ట్రేలియా బి.ఆసియా
8. ఉభయచర జంతువు?
   ఎ.చేప
   బి.కప్ప
9. కేవలం రక్తము ఆహారముగాకలది?
   ఎ. జలగ
   బి. వానపాము
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. బాలమురళీ కృష్ణ
   బి. సి.నారాయణరెడ్డి

చిన్నారి చిత్రకారులు

కె.ప్రవీణ్,
హరిపాలెం,
విశాఖ.



వై.సంజయ్‌బాబు, 1వతరగతి,
అభ్యుదయ హైస్కూల్,
హైదరాబాదు.



కె.సునీత,
విశ్వశాంతి పబ్లిక్ స్కూల్,
కొప్పరావూరు.



కె.పి.కుమార్,
ఆంధ్రా పబ్లిక్ స్కూల్, హరిపాలెం,
విశాఖ.

జపం..జపం... కొంగ జపం!



ఇక్కడ ఎవరో కొంగ జపం చేస్తూ చేపలను పట్టుకోవాలని చూస్తున్నారు. చుక్కలను కలిపితే ఆ దొంగ జపం చేసే దొంగ ఎవరో తెలిసిపోతుంది. మరి గబగబా పెన్సిలు తీసుకుని చుక్కలు కలిపేస్తారా!

ఇలా చేయగలరా!



హాయ్ం! ఇవాళ మిమ్మల్ని ఒక ప్రశ్న వేస్తాను. సమాధానం చెప్తారా! బంగాళాదుంప తెలుసుగా. దాంట్లోంచి ఒక స్ట్రానుదూర్చగలరా? ఏంటి? ఇంత చిన్న ప్రశ్నకు జవాబు చెప్పడానికి అంత సేపు ఆలోచిస్తున్నారు? టకీమని చెప్పాలి. మీ వల్లకాదా! అర్రే..! ఇలా అయితే ఎలా? పోనీ నేను చెప్పనా? ముందు తొక్క తీయని బంగాళాదుంప ఒకటి తీసుకోండి. దాన్ని ఒక చేతితో పట్టుకోండి. స్ట్రాను మరో చేత్తో పట్టుకోండి. మీ చూపుడు వేలు స్ట్రా పైకొసను మూసి వుంచాలి.

మేజిక్! మేజిక్!!

సాధ్యమైనంత బలంగా స్ట్రాతో బంగాళాదుంపను తటాలున పొడవండి. ఇలా చేసేటప్పుడు ఒక విషయం గుర్తుపెట్టుకోండి. స్ట్రాని లంబదిశగాపెట్టి...అంటే నిట్టనిలువుగా పెట్టి బంగాళాదుంపలోకి పొడవాలి. అప్పుడు కిందకి దిగుతుంది. కాస్త అభ్యాసం చేస్తే చక్కగా చేయగలుగుతారు. ఎంత చక్కగా అంటే. బొమ్మలో కనిపిస్తోందే. అలా.

దుంపలోకి స్ట్రా దూసుకుపోవడానికి ఓ కారణం వుంది. మీరు బంగాళాదుంపను చేతితో పట్టుకుంటారు. అందువల్ల అది నిశ్చలంగా వుంటుంది. దుంపను పొడిచే స్ట్రాకు మంచి తాకిడిశక్తి కలుగుతుంది. గొట్టంలో సంకోచస్థితిలో వున్న గాలి ఒత్తిడి వల్ల స్ట్రా గట్టిగా వుండి వంగదు. విరగదు. అందువల్ల అది దుంపలోకి దూసుకుపోతుంది. మరి ప్రయత్నించి చూడండి.

క్విజ్ 74 జవాబులు

1. హిమాలయములు 2. ఫిరదౌసి 3. బెంగుళూరు 4. ఎస్కిమోలు 5. ఉన్ని తివాచీ 6. రాంట్‌జన్ 7. శని 8. పాల దంతాలు 9. కొలజాడి 10. జుగ్‌రాజ్ సింగ్

క్విజ్ 73కు సరైన సమాధానాలు రాసిన వారు :

పడాల అనిల్‌కుమార్, 8వ తరగతి, **టి.సునీల**, 6వ తరగతి, ఎస్‌విఎన్‌ఆర్ స్కూల్, మల్లికార్జునకాలనీ, రాజాం. **ఎ.శాంతకుమారి**, 5వ తరగతి, **ఎమ్.వినీత**, 10వ తరగతి, కోడూరు, గుంటూరు. **పి.లక్ష్మి**, 10వ తరగతి, అప్పికట్ల, గుంటూరు. **టి.భావనకుమారి**, 6వ తరగతి, చిన్నమండలవీధి, శ్రీకాకుళం. **కుర్రా శారద, కుర్రా లక్ష్మి** గవరపాలెం, విశాఖ. **పి.అక్బర్**, 9వ తరగతి, చింతల్‌ఘూట్, మెదక్. **డి.శ్రీనివాసరావు**, 9వ తరగతి, త్రిపురాంతకం, ప్రకాశం.

కలం స్నేహం

పేరు: ఎ.పరిమళ,
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, ప్రజాశక్తి పేపరు చదవడం.
పూర్తి చిరునామా : ఎ.పరిమళ, డాటరాఫ్ ఎ.దేవానంద్, ఇంటినెం: 3.41, భోగాపురం, కంచుగుమ్మల, రోలుగు గుంట, విశాఖ.

పేరు: పోతురాజు తేజో భవానీ శంకర్,
వయసు : 11 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు : ఇతరులకు సహాయం చేయడం, పేపరు చదవడం.
పూర్తి చిరునామా :పోతురాజు తేజో భవానీ శంకర్, సన్నాఫ్ పోతురాజు శేషగిరిరావు, ఎల్ఐసి, అద్దంకి, ప్రకాశం.

పేరు: గుంటగాని ప్రేమ్‌కుమార్,
వయసు : 16 సం॥
చదువు :10వతరగతి
హాబీలు : ఎస్‌టిడిలో వుండడం, ప్రజాశక్తి పేపరు చదవడం.
పూర్తి చిరునామా : గుంటగాని ప్రేమ్‌కుమార్, 10వ తరగతి, జడ్‌పిహెచ్ హైస్కూలు, పెదఇర్లపాడు.

రెండు గాడిదలు



అక్బర్-బీర్బల్ కథలు

ఓ రోజు అక్బరుపాదుషా, వారి కుమారుడు యమునానదీ తీరంలో విహరిస్తున్నారు. వారివెంట బీర్బల్‌కూడా వున్నాడు. ముగ్గురూ ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. కొంత దూరం వెళ్లేసరికి చక్రవర్తికి, ఆయన కుమారునికి నదిలో స్నానం చేయాలన్న కోరిక కలిగింది. వెంటనే బట్టలు తీసి బీర్బల్ చేతిలోపెట్టి నదిలోకి దిగారు. వారి స్నానం పూర్తి అయ్యేవరకు బీర్బల్ దుస్తులు పట్టుకుని నిల్చున్నాడు. గట్టుపైకి వచ్చిన పాదుషావారు బీర్బల్‌వైపు, బట్టలవైపు చూసి 'పండిట్‌జీ! మీ మీద ఒక గాడిద బరువు వుందికదూ' అన్నారు. చక్రవర్తి హాస్య ప్రియులు కనుక తన శరీర బరువును అలా గాడిదతో పోల్చారనుకున్నాడు బీర్బల్. తనను అంత మాట అన్నాక బీర్బల్ మాత్రం ఊరుకుంటాడా... వెంటనే తండ్రీకొడుకులిద్దరినీ గాడిదలను చేయాలనుకున్నాడు. 'ప్రభువులవారు పొరబడ్డారు. ఒక్క గాడిద బరువు కాదు. రెండు గాడిదల బరువు మోశాను' అన్నాడు. ఆ మాటలలోని అంతరార్థం గ్రహించిన పాదుషా సిగ్గు పడ్డారు.

నీరు తాగని ఎలుక

ఎడారుల్లో కంగారు ఎలుక అని ఒక చిన్న ఎలుక వుంటుంది. 38 సెంటీమీటర్ల పొడవు మాత్రమే వుండే ఈ ఎలుక తోక పొడవెంతో తెలుసా? 20 సెంటీమీటర్లు. ఈ ఎలుకకి ముందుకాళ్లు పొట్టిగానూ, వెనుకకాళ్లు పొడవుగానూ వుంటాయి. అందుకే దీనికి కంగారు ఎలుక అని పేరొచ్చింది. ఇది పగలంతా బొరియల్లో వుండి, రాత్రి వేళల్లో ఆహారాన్ని వెతుక్కుంటుంది. ఆ ఆహారాన్ని నోటిలోవున్న చిన్న సంచులలో దాచుకుంటుంది. అంతేకాదు తోక చివర కొవ్వుని దాస్తుంది. ఇది ఎన్నడూ నీళ్లు తాగదు. తినే ఆహారంతోనే నీటి అవసరాలు తీర్చుకుంటుంది.

ఇంటింటికీ తె(ల్గీ)లుగు(సం)దేశం

"బాబోయ్... బాబోయ్...!" సోమయ్య వుత్సాహంగా హడావుడి పడ్డాడు. పచ్చబాబు పళ్ళికిలించి బ్రేకు వేశాడు. "ఏంటా గెంతులు... కాస్తంత గుంభనంగా వుండడం నేర్చుకో... సొల్లువాగుడు వాగితే పళ్ళు రాలగొడతారు.... పద...!" బయలుదేరబోతుండగా గుమ్మంలో ఎదురైన భార్య గారిని చూసి కండ్లు మిటకరించాడు.

"ఏం లేదే... ఎలక్షన్లింగా పట్టుమని పదినెల్లయినా లేదాయె! ఏదో రకంగా జనాల్ని మాయజేసి మూటకట్టకపోతే ఓట్లు రాలవు.. అందుకే ఇంటింటికీ ప్రచారం... అంటే మరేం లేదు... నా వాటాకో యాభై కటుంబాలు... వాండ్లను రోజు విడిచి రోజు బాగున్నారా... ఏంతింటున్నారు.. అబ్బా చేస్తున్నాడు... అమ్మాయి పెండ్లి సంబంధం ఏమయిందీ...?" అని అట్లా పలకరించి మధ్యమధ్యలో మీరు మాకే మీ ఓటు పక్కా ఖరారు చేసి పెట్టండని వూదరేద్దామనీ...

ఆవిడగారు కండ్లు చికిలించిందీ అంటే ఇక చిక్కుముడి పడిపోతుందని అర్థం... బాబుగారు బేలగా చూశాడు.

"తెలివి తగల బడినట్లుంది.. ఒరే తమ్ముడూ... నీకూ బుద్ధీజ్ఞానం లేకుండా పోతుంది...ఛు..." (సోమయ్య కుంచించుకుపోయాడు)

"ఎందుకే... మన నియోజకవర్గం యమ్మెల్యేను మార్చే మాస్టరు ప్లాను బాబుగారు చేస్తున్నారు. నేను కాస్తంత కాలు జాడిస్తే ఆ టికెటు కాస్తా వచ్చి జేబులో పడుతుందేమోననీ..."

"మీ మొహం... ఇంటింటికీ తిరగండి.. అడిగేదేదో మీరే డయిరెక్టుగా అడగండి - అంతేగానీ 'బాగున్నారా'... అంటే ఆ కొంప మొత్తం రోగాలు నొప్పులతో పడుంటే మీ పని ఖాళీ... 'ఏం తింటున్నారూ' అంటే ఖాళీ బొచ్చె చూపిస్తారు...."

ఆవిడ అట్లా దండకానికి తగులుకోడంతో డీలాపడిపోయిన పచ్చబాబు సమయం చూసి సందులో నుండి బయటపడ్డాడు. ఆవిడ గమనించనే లేదు... సోమయ్య ఆయాస పడుతూ బాబు వెనకే పరుగెత్తాడు.

* * *

''ఓరోరి... వెంకట్రావుడు ఎక్కడికిపోయినాడూ.. ఏంటమ్మా.. ఏడీ!" పచ్చబాబు పరాకుగా అడిగాడు. మాటిమాటికీ భార్యగారి మొహమే గుర్తొస్తుందాయె! అదేమో జక్కులోడి ఇల్లు... జక్కులోడి భార్య చాలా మర్యాదగానే సమాధానం చెప్పి కూర్చోమంది.

"అదీ.. అద్దదీ.... అయితే అంతా బాగానే వున్నారు... సంతోషం.. పుష్కరాల్లో కూడా మునిగారన్నమాట.. మరింకేం ఢోకా లేదు... మళ్ళీ వచ్చేస్తున్నాయి మీ కోసం.. ఇక ముందు యాడాదికోసారి మీ పాపాలన్నీ ఫటాఫట్..

వింతగా వింటున్న జక్కులోడి భార్య అయోమయంగా చూసి పక్కగదిలో గిన్నెలు కిందికి దొర్లిస్తున్న కొడుకును గట్టిగా కేకలేసింది. "ఒరేయ్ భడవా... ఏం పనుల్రా అవీ... కృష్ణా.. ఒరే క్రిష్ణయ్యా... ఏందిరా అదీ... నీ కస్సలు భయం లేకుండా పోయిందిరా... ఆ గిన్నెలతో నీకు ఆటలేందీ..

పచ్చబాబు దబ్బున విరుచుకుపడ్డాడు. బావను చూసి బాగుండదని సోమయ్య కూడా మంచంలో, అదనంగా చిన్న హాహాకారం కూడా చేసి పడిపోయాడు. ఆవిడ ఈలోపున కేకలేయడం ఆపి వింతగా చూసింది.

''అన్నయ్యగారూ... మంచినీళ్ళు తాగుతారా... ఎండదెబ్బగానీ తగిలిందా? అయ్యో... అయ్యో...!" ఆవిడ హడావుడి పడేంతలో బాబుగారు దబ్బున నిటారుగా లేచి నించున్నాడు.

"అబ్బెబ్బే... ఏం లేదు... ఏమీ లేదు... మీ అబ్బాయి బాగా అల్లరి పెడుతున్నట్లుంది చెల్లెమ్మా... బళ్ళో వేస్తే పీడాపాయిరి"! బాబుగారు గదిలోకి భయంగా తొంగిచూస్తూ అన్నాడు.

"హమ్మో.. అల్లరంటే... అల్లరీ... వాడి అయ్యకు వాడండే యమా గారాబం... దెబ్బ పడనీయడు... సచ్చిపోతున్నాను... ఎక్కడ ఏది వుంచినా అన్నీ దొర్లించి పారేస్తున్నాడు. పేరుకు తగ్గట్టు వాడికి అన్నీ ఆ కొంటి క్రిష్ణయ్య తుంటరి చేష్టలే..

పచ్చబాబు దడాల్న మంచంమీద కూలబడ్డాడు. సోమయ్య కూడా! బాబుగారి కాళ్ళలో సన్నని వణుకు మొదలైంది.... మొహం నిండా చిరుచెమట్లు..

"అదే... మొన్నటి క్రిష్ణాష్టమి.. ఉట్లు పండుగ వెళ్ళినంక అదేదో ప్రయివేటు బళ్లో తోల్దామనుకుంటిమి.. క్రిష్ణా.. ఒర్రేయ్ క్రిష్ణా.. అన్నీ ఆ కొంటి కిష్టుడి తుంటరి చేష్టలే.. అన్నీ వీడికే కావాలి.." ఆవిడ గదిలోకి అరుచుకుంటూ గబగబ పోయింది. బాబుగారు వెనక్కు దబాల్న విరుచుకుపడ్డా... సోమయ్యకు అనుమానం వచ్చి బావగారిని అనుకరించలేదు. ఇట్లా మాటిమాటికీ పడడం... కూలబడ్డం.. ఎవడైనా చూస్తే బాగుండదు... మూర్ఛరోగి అనుకుంటారు.. డేంజర్... హమ్మో...

'బావా.. లేలే... ఆవిడగారు వస్తే బాగుండదు.. చూస్తే వాడకట్టంతా డప్పు మోగిస్తుంది.. లే... లే..!" బలవంతంగా పచ్చబాబు లేచి బయటపడ్డాడు. సోమయ్య వెంటబడ్డాడు!

* * *

"తమ్ముడు సోమయ్య చెప్పాడు.. మీరట్లా 'విరుచుకుపడిపోడం' అనే వింత రోగం మీకుందని నాకు ముందే చెప్పనేలేదు. ఎందుకు? అది మూర్ఛవ్యాధా... మూలశంకా? మతలబేంది?" పచ్చబాబు భార్యగారు గద్దిస్తుంది. బాబుగారు కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాడు. సోమయ్య జడుసుకుని గదిలో ఓ మూలన నక్కాడు.

"అది కాదమ్మా మహాతల్లీ... ధైర్యం చేసి జనం దగ్గరకు 'ఇంటింటికి దేశం' సందేశం పట్టుకుపోదామని బయలుదేరినాం... గదా! హమ్మో... మా పార్టీ మాజీ మంత్రి.. ఎమ్మెల్యే కృష్ణాయాదవ్‌ని బొంబై పోలీసులు స్టాంపుల కుంభకోణంలో బొక్కలో నూకినారాయె! వామ్మో... ముప్పయి రెండువేల కోట్లు...దేశ ద్రోహం... రెండు కోట్లు.. దావూద్ ఇబ్రహీం... యాభైలక్షలు.. టేపులో గొంతు.. ఇంగనావల్ల కాదంటే కాదు..." పచ్చబాబు గడగడా వణికి కుర్చీలో కూలబడ్డాడు.

"అరె... అంత భయమేంది?" మీ చెంద్రబాబుగారు "ఇదంతా ఇట్లా జరిగేదే.. ఇదేం వింతకానేకాదు... ప్ర.బ్యాంకు సంస్కరణలు జరిగే చోటల్లా గిది మామూలుగా జరిగే మతలబులే అంటున్నాడు.. ఏం ఫికర్ చెయ్యకండి... అని ధైర్యం కూడా ఇస్తున్నాడు గదా!"

"అరవకే... అటు ఆ బ్యాంకు దెబ్బకే జనం కకావికలైపోతున్నారాయె.. హమ్మా... ఖర్మ... మళ్లీ ఇదోటా.. క్రిష్ణ.. క్రిష్ణ.. ఛ.. నకిలీ స్టాంపులు.. దావూద్.. హమ్మో...!"

"వార్నీ... బాగుంది సంబడం... జనాలేమో తిండీ... నీళ్ళు దొరక్క సచ్చిపోతున్నారు - రైతులకు పంటలకు నీళ్ళు.. ఎవళ్ళ గోలలో వాళ్లే వుండిపోయింద్రా... ఈ కుంభకోణం ఎవడికీ పట్టదు. పట్టినా ఓ రెండు రోజులు పోతే గప్‌చుప్... మర్చిపోతారు... అయినా ఇవన్నీ చూసీ-వినీ... అలవాటు పడ్డారు ఈ ఎనిమిదేండ్ల నుండీ.. అని మీకు పాఠాలు కూడా చెప్పించాడు గదా!"

"హబ్బా... ఇంకా కొంతమంది మా పార్టీ యమ్మెల్యేలు.. ఇద్దరు ముగ్గురు మంత్రులక్కూడా బేడీలు తగులుకోవచ్చు.... ఇంకా పెద్ద పోలీసు అధికార్లు... వాళ్ళెవరో తెలవక తన్నుకుని గంగవెర్రులెత్తిమేం చస్తున్నాం...ఆc!"

"తిలాపాపం... తలాపిడికెడు... మొదట్నుంచీ అలవాటేనాయె! బ్యాంకు నుంచి అప్పు సప్పులు తేడం.. రోడ్లనీ... మరుగుదొడ్లనీ... ఇండ్లనీ... కాలవలనీ కాంట్రాక్టరు దుకాణాలు పెట్టుకుని కింద నుంచి పైదాకా పంచుకుని కార్లలో తిరుగుతున్నారు గదా... మీకిదేం కొత్తా? మీ అందరికీ అంతో ఇంతో అందే వుంటుంది.." ఆవిడ గంగాళం గొంతేసుకుని వాడకట్టంతా వినిపించేలా వుపన్యాసానికి తగులుకునే సరికి పచ్చబాబు నిలువు గుడ్లేసుకుని నిక్కినీలిగాడు. సోమయ్య వరండాలో విరుచుకుపడి మూర్ఛపోయాడు!! ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

"నిజమే! ధ్వనులను గుర్తిస్తుందంటే శిశువుకు గ్రహించే శక్తి వున్నదని తెలుస్తున్నది. అసలు శిశువు తల్లి గర్భంలో వున్నప్పట్నుంచే ధ్వనులను గుర్తుపడ్తుంది అంటే ధ్వనులను, ధ్వనులపై ఆధారపడిన భాషను నేర్చుకోవడం అప్పట్నుంచే ఆరంభమవుతున్నదన్నమాట. తల్లి గర్భంలో నుంచే నేర్చుకుంటున్న భాష కాబట్టి కావచ్చు. తల్లిభాష - మాతృభాష అంటారు. ప్రపంచంలో వున్న అన్ని భాషల్లోనూ శిశువు మాట్లాడ్డం మొదలు పెట్టినప్పట్నుంచి మాట్లాడే భాషను మాతృభాష - మదర్‌టంగ్ అనే అంటారు కాని పితృభాష - ఫాదర్ టంగ్ అని అనరు"

శిశువు జ్ఞానం ఇప్పటిదా, అప్పటిదా!

"లల్లీ! చాలా రోజులైంది కన్పించడం లేదు" అడిగాను ఇంట్లోకి వస్తున్న లలితను చూసి.

"ఏమోనే! మున్సిపల్ వాళ్ళు నల్లా నీళ్ళు ఎప్పుడు వదుల్తారో తెలియదు. నీళ్ళ కోసం ఎదురుచూపులతోనే వున్న టైమంతా అయిపోతోంది. ఎక్కడికీ కదలడం లేదు. ఈ రోజు నీళ్ళు పొద్దున్నే మామూలు వేళకు వచ్చాయి కాబట్టి తీరిక దొరికింది. ఇట్లా నిన్ను చూద్దామని, మాట్లాడ్దామని వచ్చాను" అంది లలిత సోఫాలో కూలబడుతూ. నీళ్ళ సమస్యతో అది బాగా టెన్షన్‌లో పడి అలసిపోయినట్లుంది. అటువంటప్పుడు నీళ్ళను గురించి మాట్లాడి దాన్ని విసిగించకూడదనుకున్నాను. అందుకే వేరే టాపిక్ ఎత్తుకున్నాను.

"లల్లీ! ఈ వార్త విన్నావా?..." నా మాట పూర్తికాక ముందే లలిత అందుకొని

"ఏ వార్తే?" అని ఆత్రంగా అడిగింది. దాని ఆత్రం చూసి "అమ్మయ్య! అది నీళ్ళ టెన్షన్నుంచి బయటపడినట్లుంది" అనుకున్నాను.

"మొన్ననే ఎక్కడో చదివానే - శిశువు పిండరూపంలో తల్లి గర్భంలో వున్నప్పుడే తల్లి గొంతును గుర్తు పట్టి స్పందిస్తుందట. అంతేకాదు వేరువేరు గొంతుల్లోని మాటల ధ్వనుల్లో ఎప్పుడూ వినే తల్లి గొంతు ఏదో గుర్తిస్తుందట. ఇది విచిత్రంగా లేదూ!" అన్నాన్నేను ఉత్సాహంగా.

"అంత ఉత్సాహమెందుకే మన వాళ్ళు ఎప్పుడో చెప్పారు - శిశువు గర్భంలో వున్నప్పటి నుంచే ధ్వనులకు స్పందిస్తుందని. అంతేకాదు శిశువు తల్లి గర్భంలో వున్నప్పట్నుంచే నేర్చుకోవడం ఆరంభిస్తుందని-" అంది లలిత.

"నిజమే! ధ్వనులను గుర్తిస్తుందంటే శిశువుకు గ్రహించే శక్తి వున్నదని తెలుస్తున్నది. అసలు శిశువు తల్లి గర్భంలో వున్నప్పట్నుంచే ధ్వనులను గుర్తుపడ్తుంది అంటే ధ్వనులను, ధ్వనులపై ఆధారపడిన భాషను నేర్చుకోవడం అప్పట్నుంచే ఆరంభమవుతున్నదన్నమాట. తల్లి గర్భంలో నుంచే నేర్చుకుంటున్న భాష కాబట్టి కావచ్చు. తల్లిభాష - మాతృభాష అంటారు. ప్రపంచంలో వున్న అన్ని భాషల్లోనూ శిశువు మాట్లాడ్డం మొదలు పెట్టినప్పట్నుంచి మాట్లాడే భాషను మాతృభాష - మదర్‌టంగ్ అనే అంటారు కాని పితృభాష - ఫాదర్ టంగ్ అని అనరు" అన్నాన్నేను ఏదో ఆవిష్కరణ చేసినంత ఆనందంతో.

లలిత మౌనం చూసి మళ్ళా మొదలు పెట్టాను. "అందుకే తల్లులు గర్భవతులుగా వున్నప్పట్నుంచే జాగ్రత్తగా వుండాలి. ఎటువంటి మత్తు పదార్థాలను సేవించకుండా వుండాలి. అంతేగాక మంచి భోజనం, మంచి అలవాట్లు, మంచి పరిసరాలు అవసరమని దీన్నిబట్టి తెలుస్తున్నది. తల్లి ఆనందంగా, ఆహ్లాదంగా వుంటే, ఏ చీకూచింతా అలజడి ఆవేదనలు లేకుండా వుంటే శిశువు ఆరోగ్యంగా ప్రసన్నంగా పెరుగుతాడు. బుద్ధిమంతుడవుతాడు. తెలివిగలవాడు వేగంగా దేన్నైనా గ్రహించే శక్తివంతుడవుతాడు మరి!" అన్నాన్నేను.

"బుద్ధిమంతుడవుతాడు - అని ఎందుకంటున్నావే? బుద్ధిమంతురాలు అవుతుందను!" నవ్వింది లలిత.

"అబ్బ! ఇక్కడ కూడా నీ ఫెమినిజమేనా. శిశువు అంటే నా అభిప్రాయం ఆడ మగ - శిశువు ఎవరైనా సరే తెలివిగల వాళ్ళవుతారని!"

"తెలివిగల వాళ్ళవుతారంటే - నాకు మహాభారతంలో అభిమన్యుని కథ గుర్తుకు వస్తున్నదే. అర్జునుడు గర్భవతిగా వున్న సుభద్రకు పద్మవ్యూహం గురించి చెప్పాడని, గర్భంలో వున్న అభిమన్యుడు ఆ విద్యను నేర్చుకున్నాడని అంటే పుట్టుకతోనే అభిమన్యుకు పద్మవ్యూహం గురించి తెలుసంటే దాన్ని అతడు తల్లి గర్భంలో వున్నప్పుడే విని గ్రహించాడని ఆ కథ చెప్తున్నది. అంటే! మన ప్రాచీనులూ కొన్ని శాస్త్రీయ సత్యాలే చెప్పారనిపిస్తుంది. అన్నిటినీ చాదస్తాలని కొట్టేయలేం!" అంది లలిత.

"చాదస్తాలవునో కాదో గాని గర్భవతిగా వున్నప్పుడు తల్లులు మంచి పుస్తకాలు చదవడం, వినడం వల్ల శిశువు మీద ప్రభావం వుంటుంది!" అన్నాన్నేను. "అంతేగాదు! రోజూ కాస్సేపు గర్భస్థ శిశువుతో ముచ్చట్లాడడం కూడా మంచిదేమో ఆలోచించు!" నా మాటలు విని నవ్వింది లలిత. దాని టెన్షన్ దూరమైనందుకు సంతోషించాన్నేను. ●

ప్రాచీన శిల్పాలయం గుడిమల్లం



చిత్తూరు జిల్లా పేరు వినగానే ఎవరికైనా ఆధ్యాత్మికతకు మారుపేరైన తిరుమల, ఆ తరువాత శ్రీకాళహస్తి పేర్లు జ్ఞప్తికి వస్తాయి. అయితే చారిత్రకంగా ఈ రెండు ఆలయాలు ఉనికికి రాని కాలం నుంచే గుడిమల్లం దేవాలయం ఉంది.

క్రీస్తుపూర్వం 2వ శతాబ్దం నుంచి ఉనికిలో ఉన్న ఏకైక ప్రాచీన ఆలయం ఇది. శైవం వైష్ణవం రెండింటినీ ప్రతిబింబిస్తూ ఉన్న ఆలయం గుడిమల్లం దేవాలయం. చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం గ్రామంలో పరశురామేశ్వర ఆలయం వుంది. తిరుపతి నుంచి 30 కి.మీ దూరంలో, రేణిగుంట విమానాశ్రయం నుంచి 10 కి.మీ దూరంలో ఉన్న గుడిమల్లం ఆలయం దేశంలోనే అత్యంత ప్రాచీనమైన చరిత్రను కలిగివుంది. క్రీస్తుపూర్వం రెండు, మూడు శతాబ్దాల నాటి నుంచి ఆలయం ఉనికిలో ఉన్నట్లు లభ్యమైన శిలాశాసనాలు వెల్లడిస్తున్నాయి. క్రీస్తుపూర్వం రెండవశతాబ్దంలో మలిచక్రవర్తి నిర్మించిన ఈ ఆలయంలో విష్ణు, బ్రహ్మ, శివుని ఆకృతులు ఒకే విగ్రహంగా రూపొందించబడివుండటం విశేషం. ఇటువంటి త్రిమూర్తులు కలిగిన శివలింగం దేశంలో ఇక్కడమాత్రమే ఉందని పురావస్తు శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. పరశువు (గొడ్డలి) ధరించిన విష్ణు ఆకృతి శివలింగంలో ఇమిడి ఉండటం గుడిమల్లం దేవాలయం ప్రత్యేకత. శైవాలయం అయినా పరశురాముని అవతారం శివలింగంలో ఉండటం వల్ల దీనికి పరశురామేశ్వర ఆలయంగా పేరు



వచ్చింది. నల్లరాతితో ప్రత్యేకశైలిలో చెక్కిన ఈ విగ్రహం విలువ ఆర్కియాలజీ అధికారుల అంచనా ప్రకారం అంతర్జాతీయ మార్కెట్‌లో 5 కోట్ల రూపాయలని తెలిసింది. ఆలయంలోని నముదాయాలు పల్లవ, చోళ, బాణ వంశపు రాజుల శిల్పశైలిని వెల్లడిస్తున్నాయి. కార్తికేయ, దేవి, సూర్యదేవ విగ్రహాలున్నాయి. ఇక్కడ లభ్యమైన శిలాశాసనాల ఆధారంగా క్రీ.శ.842 నుంచి క్రీ.శ 1346 మధ్యకాలంలో యాదవదేవరాయలకాలం వరకు పూజలు జరిగాయి. ఆ తరువాత ఆలయ నిర్వహణ కుంటుబడింది. గుడిమల్లం ఆలయంలో 60 సంవత్సరాలకు ఒకసారి గర్భగుడిలో విగ్రహం పూర్తిగా మునిగిపోయే విధంగా నీళ్ళు వస్తాయి.

ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్న ఈ దేవాలయాన్ని జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించి ఆలయం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రహరీ మరమ్మతులను చేపట్టింది. ఆలయగోపురం కూడా పునర్నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దేవాలయానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నది. ప్రస్తుతం ఈ కమిటీ సభ్యులే ఢిల్లీలోని ఆర్కియాలాజికల్ డైరెక్టరేట్ నుంచి పూజలు నిర్వహించుకునేందుకు అనుమతి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లాను సందర్శించే పర్యాటకులు గుడిమల్లం ప్రాచీన చరిత్రకు జ్ఞాపికగా వున్న గుడిమల్లం పరశురామేశ్వర ఆలయం చూసితీరాల్సిన పర్యాటక స్థలం. అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ఆలయానికి ప్యాకేజ్ టూర్లు ప్రారంభిస్తామని చెప్తున్న పర్యాటకశాఖ అధికారులు మాత్రం ఇంతవరకు ప్యాకేజ్‌టూర్లు కాదుకదా గుడిమల్లం దేవాలయం గూర్చి వివరాలే పర్యాటకులకు తెలియజేయలేని స్థితిలో వున్నారు. గుడిమల్లం సందర్శించాలనుకునే పర్యాటకులు తిరుపతి సెంట్రల్ ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులో వెళ్ళేందుకు సౌకర్యంవుంది. రాష్ట్ర పర్యాటకశాఖ ఇప్పటికైనా పట్టించుకొని పర్యాటక పరంగా గుడిమల్లంను పర్యాటకులు సందర్శించేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించాల్సి వుంది. ●

అథ్లెటిక్స్ అనగానే వెంటనే స్ఫురణకు వచ్చేపేరు పి.టి.ఉష. ఆమె గురించి వినని క్రీడాభిమాని ఉండడంటే అతియోశక్తి కాదు. భారత మహిళా అథ్లెట్లలో ఆమె సంపాదించినంత క్రేజ్ మరెవరికీ రాలేదు. ఆమె ప్రస్తుతం అథ్లెటిక్స్ స్కూల్ నిర్వహణలో మునిగిపోయి ఉంది. కేరళలోని కోజికోడ్‌జిల్లాలోగల కోయిలాండిలో ఆమె ఈ స్కూల్‌ను 2002లో నెలకొల్పింది. మన దేశంలో ఒక అథ్లెట్ నడుపుతున్న ప్రయివేటు స్కూళ్లలో ఇదే అతి పెద్దది. 2008 ఒలింపిక్స్‌లో మన అథ్లెట్లు విక్టరీ పోడియంను అధిష్టించేలా చేయడమే తమ స్కూల్ లక్ష్యమని ఆమె పేర్కొంది. ఈ స్కూల్‌లో ఆమె యువ అథ్లెట్లకు అలుపెరుగని రీతిలో శిక్షణ ఇస్తోంది. ఒకవైపు తన స్కూల్ నిర్వహణలో తలమునకలై ఉన్నప్పటికీ జాతీయ, అంతర్జాతీయ క్రీడా రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలను ఆమె గమనిస్తూనే ఉంది. పారిస్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించిన లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జ్‌ను ఆమె వెనువెంటనే అభినందించింది. జాతీయ క్రీడారంగంలో సంభవించే పరిణామాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా ప్రకటిస్తూనే ఉంది. ఇటీవల అర్జున అవార్డుల విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన గురించి ఆమె తన అభిప్రాయాలను వివరించింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టింది. అవార్డుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వివాదాలకు తావిస్తోందని ఆమె పేర్కొంది. ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కారణంగా అసలు అవార్డులకు విలువ లేకుండా పోయిందని ఆమె ఇటీవల ఒక వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విచారం వ్యక్తం చేసింది. ఉత్తమ క్రీడాకారుల ఎంపికకు సంబంధించి మార్గదర్శక సూత్రాల్లో మార్పులు చేయాలని ఆమె సూచించింది. ఇంటర్వ్యూ ఇలా సాగింది.

అవార్డుల్లో ప్రభుత్వ జోక్యం ఎందుకు?

◆ జాతీయ అవార్డుల విషయంలో మార్గదర్శక సూత్రాలను మార్చాలని మీరు ఎందుకు భావిస్తున్నారు?

అవార్డు గ్రహీతలను సిఫార్సు చేసేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా నియమించే కమిటీకి నిజమైన అధికారాలు లేవు. నేను గత ఏడాది ఈ కమిటీలో సభ్యురాలిగా పనిచేశాను. నాకొక బుక్‌లెట్ ఇచ్చారు. ఒక్కొక్క అవార్డుకు క్రీడాకారుల పేర్లకు ఎదురుగా మార్క్ చేయాలని నాకు చెప్పారు. బుక్‌లెట్‌లో పేర్కొన్న పేర్ల నుండే ఎందుకు క్రీడాకారులను ఎంపిక చేయాలని నేను సహచరులను ప్రశ్నించాను. బుక్‌లెట్‌ను అధిగమించి కొత్త వారిని ఎందుకు ఎంపిక చేయరాదని అడిగాను. అవార్డు గ్రహీతలను ఎంపిక చేసేందుకు తగిన స్వేచ్ఛ ఎంపిక కమిటీ సభ్యులకు లేదు. అందువల్లే ప్రతిష్టాత్మక అవార్డులు తగిన వారికి మాత్రమే లభించే విధంగా మార్గదర్శక సూత్రాలను మార్చాలని నేను కోరుతున్నాను. అవార్డుకు ఉన్న స్థాయిని తగ్గించరాదు.

◆ ఈ అవార్డులకు ఇటీవల కాలంలో గుర్తింపు తగ్గిపోయిందని భావిస్తున్నారా?

నేనలాగే భావిస్తున్నాను. నాకు పద్మశ్రీ, అర్జున వంటి అనేక అవార్డులు లభించాయి. అయితే ఈ అవార్డులకు పూర్వం ఉన్న విలువ ఇప్పుడు లేదు. ప్రస్తుతం రాజీవ్ ఖేల్‌రత్న, అర్జున అవార్డుల వంటి అత్యున్నత అవార్డుల ఎంపిక వివాదాస్పదంగా మారింది. ఇందుకు ప్రభుత్వానిదే బాధ్యత అని నేను భావిస్తున్నాను. అవార్డు ఎవరెవరికి ఇస్తే సముచితంగా ఉంటుందో ఎంపిక కమిటీ సూచించింది. అయితే ఈ పేర్లను మార్చాలని ప్రభుత్వం కమిటీని కోరింది. అవార్డు గ్రహీతల పేర్లను ఎంపిక చేయడంలో కమిటీ ఎటువంటి పొరపాటూ చేయలేదు. ఈ విషయంలో ప్రభుత్వ వాదనతో నేను ఏకీభవించడం లేదు. ఇంతమందికే అవార్డులు ప్రకటించాలనడం యుక్తంగా లేదు. అవార్డులను ప్రకటించడంలో ప్రభుత్వ ఉద్దేశం ప్రతిభ చూపుతున్న క్రీడాకారులను ప్రోత్సహించడం. దీనికి ఒక పరిమితి నిర్దేశించడం సరికాదు. ఒలింపిక్స్‌లో ఇద్దరు స్వర్ణ పతకాలు గెలుచుకుంటే పరిస్థితి ఎలా ఉంటుంది? ఒకరికే అవార్డు ఇస్తామంటే ఎలా?

◆ అవార్డు గ్రహీతల ఎంపికలో రాజకీయాలు, ధనం, ఇతర ప్రలోభాల పాత్ర ఉందంటారా?

ఇందుకు సంబంధించి నా వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. అయితే ఈ విషయంలో ప్రభుత్వం నుండి ఒత్తిడి వస్తోందనేది మాత్రం నిజం. ఈ విషయంలో రాజకీయాలు జరగడం నాకు తెలుసు. క్రీడారంగంలో రాజకీయాలు ప్రవేశించరాదు. అనేక రంగాల్లో రాజకీయాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఒక ఉత్తమ అథ్లెట్‌ను ఎంపిక చేయడంలో కూడా రాజకీయాలు చోటుచేసుకోవడం క్రీడారంగానికి మంచిది కాదు.

◆ మన క్రీడా రంగంలో లోపం ఎక్కడుందంటారు?

పటిష్టమైన క్రీడా విధానం ఉండటం అవసరం. సున్నితమైన సమస్యలను పరిష్కరించేందుకు మార్గదర్శక సూత్రాలు ఉండాలి. అవార్డుల విషయంలో ప్రతి ఏడూ వివాదాలు చెలరేగడం మంచిది కాదు. ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం నాకు అవార్డు రావాలంటే నేను దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అసలు ఈ దరఖాస్తు విధానం అనేది లేకుండా అర్హులైన వారికి అవార్డు వచ్చే విధానం ఉండాలి.

◆ అథ్లెటిక్స్‌లో భారత్ భవిష్యత్ ఎలా ఉంటుందంటారు?

గత కొద్ది సంవత్సరాలుగా భారత అథ్లెట్లు బాగా రాణిస్తున్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహం అందిస్తోంది. క్రీడారంగాన్ని ఇంతకాలం నిర్లక్ష్యం చేశామన్న గుర్తింపు అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు కలిగింది. క్రీడారంగంలో భారత్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంది. క్రీడారంగం అభివృద్ధి చెందాలంటే రెండు విషయాలను గ్రహించాలి. రాజకీయ నాయకులు జోక్యం చేసుకోరాదు. శాస్త్రీయ దృక్పథం అవసరం. ●

✻ వి.గోపి



ఓ తండ్రి కథ

"ఏంటి లింగయ్యా... ఏంటి సంగతి" అంటూ అతన్ని సమీపించాను.

అతను నీళ్ళు నములుకుంటూ, అంతే వినయంగా "సారూ మీతో పని బడి వచ్చిన" అన్నాడు.

"ఏంటి సంగతి"

"ఏం లేదు సారూ... మా బిడ్డకు సంబంధం కుదిరింది. చేతిలో డబ్బులు చాలడం లేదు. అందుకై ప్రావిడెంట్ ఫండ్ లోను తీద్దామని"

"తీయి బాగానే ఉంటుంది" అన్నాను.

"అందుకోసం మీ సహాయం కావాలిసారూ" అన్నాడు.

"నేనేం చెయ్యాలి"

"కాగితాలు ఏవో పంపాలనంటా... ఆ పనేదో చేసి పెడ్తారని" అంటూ నసిగాడు.

"సరే అదేం భాగ్యం. రేపు ఉదయాన్నే కలువు... నేనా కాగితాలు తయారు చేసి పెడ్తాను" అన్నాను.

అతను వెళ్ళిపోయి మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు ఆఫీసుకు వచ్చాడు.. అంతకుముందే నేను అప్లికేషను కాగితాలను సేకరించి పెట్టుకున్నాను. నేను కూచునే టేబుల్ముందున్న బెంచీ మీద కుర్చోమని చెప్పి అప్లికేషన్ నింపేందుకు సిద్ధమయ్యాను. బెంచీ మీద కూర్చోకుండా ఇంకా అలాగే నిలబడి పోయాడు.

"నిలుచున్నావేంది. అట్లా ఆ బెంచీ మీద కూచో. ఇది మన ఆఫీసే' అంటూ బెంచీ చూపించాను.

భయంభయంగానే అతను బెంచీ కొసన కూర్చున్నాడు. అప్లికేషన్ నింపటానికి వివరాలు అడిగాను. అతను చెప్పసాగాడు. అప్లికేషన్ పూర్తి చేసి కుతూహలం కొద్ది 'కట్నం ఎంతిస్తున్నావు' అంటూ అడిగాను.

"ఎంతెక్కడిది సారూ ఇరువైవేలు"

"ఈ రోజుల్లో అది చాలా తక్కువ" అన్నాను.

"మా అక్క కొడుకే సారూ... మేనరికం.."

"అందుకే తక్కువలో ఎల్లిపోతుంది... ఇంతకు పిల్లవాడు ఏమన్నా పని చేస్తుండా?" అన్నాను.

"పది సదివిండు. ఇంటికాడ ఎకరమో, రెండు ఎకరాలో పొలం ఉంది. ఇక దానిమీదనే జీవితం"

"ఇరవై వేలకే లోను ఎందుకయ్యా? చేతుల మీద సర్దుబాటు చేసుకోలేకపోయావా" అన్నాను.

అతను లెక్కలు చెపుతూ "కట్నానికి ఇరవైవేలు కావాలా? పెట్టుబోతలు, పెండ్లి ఖర్చులు, భోజనాలకు ఎంతలేదన్నా మరో ఇరవైవేలు కావాలి.. చిట్టి వేస్తే పదిహేనువేలు వచ్చినయి. వాన్ని వీన్ని అడిగితే మరో ఐదారువేలు అప్పు పుట్టేట్టున్నది. కనీసం కట్నం మందమైనా లోను దొరికితే, ఈ గండం గట్టెక్కుద్ది" అన్నాడు.

"పాతికేండ్లయిందా నువ్వు పని చేయబట్టి. ఒక్క బిడ్డ పెండ్లి చేయడానికి సిపిఎఫ్ లోను తీస్తే తప్ప పెండ్లి చేయలేనంటున్నావు. ఇన్ని ఏండ్లనుంచి పని చేసి ఏం సంపాదించావయ్యా" అంటూ అడిగాను.

అతను నిర్లిప్తంగా నవ్వి "మీకు తెలియంది ఏముంది సారూ... జీతం ఎక్కడ సరిపోతాంది. ఒక్కన్ని పన్జేస్తే ఇంట్లో అందరూ కూచుండి తినాలి.. నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు, మా అన్న, అయ్య. ఒక్కన్ని చేస్తే

ఆరుగురి నోట్లోకి అన్నం పోవాలి" అదే నిర్లిప్తతతో జవాబిచ్చాడు.

ఇక నేనేమీ మాట్లాడలేకపోయాను.. దాదాపుగా నా పరిస్థితీ అటువంటిదే. కాకుంటే ఆఫీసులో పని చేస్తున్నాను. కాబట్టి కాస్త తెల్లబట్టలేసుకొంటున్నా, రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్న ధరలతోని, జానాబెత్తెడు జీతంతోని కుటుంబాన్ని ఈదుకురావటం ఎంత కష్టం అవుతుందో నాకు తెలియంది కాదు.

మా నాన్న ముప్పయిమూడేండ్లు సర్‌సిల్క్‌లో పని చేశాడు. ఇంకా నాల్గేండ్లకు దిగిపోతాడనగా మేనేజ్‌మెంట్ ఫ్యాక్టరీని మూసేసింది. ఉన్న పళంగా ఫ్యాక్టరీని మేసేయడంతో వేలాది మంది కార్మికుల పరిస్థితి నీళ్ళు లేని కాడ బొండిగ కోసినట్టయింది. లాభాలు వచ్చినంత సేపు ఫ్యాక్టరీని నడిపించుకున్న మేనేజ్‌మెంట్ వట్టిపోయిన ఆవును కటికవానికి అప్పచెప్పినట్టు ఫ్యాక్టరీని మూసేసింది. అర్థాంతరంగా ఉద్యోగాలు పోవడంతో దిక్కుతోచని కార్మికులు అన్నమో రామచంద్రా అంటూ అడుక్కుతినే పరిస్థితి వచ్చింది. ఫ్యాక్టరీలో పని చేసినప్పుడే అంతంత మాత్రంగా నడిచే జీవితాలు, వచ్చే ఆ నాలుగు రాళ్ళు కూడా రాకపోయే సరికి గుండె బేజారెత్తి బతకలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. వారితో పోల్చుకున్నప్పుడు మా పరిస్థితి కొంత మెరుగే. ఎందుకంటే అప్పటికే నేను ఉద్యోగం చేస్తుండటం వలన, ఎలాగో ఒకలాగా ప్రాణాలు నిలబెట్టుకోగలిగాము. మా నాన్నకు రావాల్సిన పైసలు రాబట్టుకోవడమే గగనమైంది. వారిచ్చిన పాతిక ముప్పయి వేలు మాచెల్లి పెండ్లికి చేసిన బాకీ కింద జమ అయిపోయింది.

ముప్పయి మూడు సంవత్సరాలు సాంచెల మీద నిలబడి పని చేయటం వలన మా నాన్న కాళ్ళు మలిగేటివి కావు. అలా కట్టెకరుసక పోయాయి. చివరికి అన్నం తినాలన్నా క్రింద కూచోలేకపోయేవాడు. ముక్కాలిపీట మీద కూచొని కాళ్ళు చాపుకోవలసి వచ్చేది.. చివరికి ఏడాది కింద అతను చనిపోయినప్పుడు మా సంప్రదాయం ప్రకారం 'పావుడా' కట్టాల్సి వచ్చినప్పుడు కూడా కాళ్ళు దగ్గరికి రాలేదు. అలా కాళ్ళు సాపుకునే కాటికి తీసుకుపోవల్సి వచ్చింది.

లింగయ్య బిడ్డ పెండ్లికి బావి మీద వోవర్‌మెన్లతో పాటు మా ఆఫీసుల పనిచేసే రైటర్లందరినీ విందుకు పిలిచాడు. విందునాడు సాయంత్రం అతనింటికి పోయాము. అతనిల్లు మార్కండేయ బస్తీలో రెండు గదులున్న చిన్న గుడిసె. గుది గుచ్చినట్టుగా కిక్కిరిసి ఉండే కార్మికవాడలో అతని ఇంటికి చేరుకోవడానికి ఒకింత కష్టమే అయింది. ఒక మనిషికి మరో మనిషి ఎదురైతే ఎవరో ఒకరు తప్పుకొని దారి ఇస్తేగాని మరొకరు ముందుకుపోలేని ఇరుకైన వీధుల గుండా మేము అతని ఇంటికి పోయాము. కార్మికులు అధికంగా నివసించే ఆ బస్తీ ఎంత మురికిగా ఉందంటే ఆ మొత్తం బస్తీ ఒక మురికి గుంటయితే అక్కడ మెసిలే మనుషులంతా ఆ మురికి గుంటలో మెదిలే కీటకాల్లా ఉన్నారు. కాలరీ ఏరియాలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. ఒకవైపు మురికి కూపాల్లాంటి కార్మిక బస్తీలుంటే... మరోవైపు అధికార్లు నివసించే కాలనీలు అందుకు భిన్నంగా తీర్చిదిద్దినట్టుగా ఉండే వీధులు, అన్ని హంగులతో అలరారే బంగ్లాలు... పచ్చటి చెట్ల మధ్య గంభీరంగా, అవసరానికి మించి ఉన్న విద్యుత్ దీపాలతో అలరారుతుంటాయి. పరస్పర విరుద్ధమైన రెండు విభిన్నమైన జీవితాలు పక్కపక్కనే సహజీవనం చేయడమన్నది కాలరీ ప్రత్యేకత. ఒకవైపు మానవ కనీస అవసరాలైన నీరు, కరెంటు, పారిశుధ్య లేని ఇరుకైన గుడిసెలు, మరో పక్క అన్ని వసతులతో భోగలాలసంగా ఉండే బంగ్లాలు. ఈ రెంటికి మధ్య త్రిశంకు స్వర్గంలా మధ్యతరగతి జీవులు నివసించే మరికొన్ని కాలనీలు ఉన్నాయి.

ఆ విందు రోజునే మొదటిసారిగా లింగయ్య కొడుకును చూశాను. అదే నేను చివరిసారిగా చూడటం కూడా. కార్మికులు ఇంట్లో ఏదన్నా శుభకార్యం జరిగితే ఏది ఉన్నా లేకున్నా విందు మాత్రం బ్రహ్మాండంగా ఏర్పాటు చేస్తారు. అందునా బావి మీద పని చేసే మా

కోసం కేటాయించిన గదిలో మాకు విందు ఏర్పాట్లు జరిగాయి. బగారు వేసిన సన్నబియ్యపు అన్నం, ఘుమ ఘుమలాడే దాల్చారు, నోరూరించే మాంసం కూర, ప్రత్యేకంగా తయారు చేసిన మేక మాంసపు వేపుడుతో ఆ రోజు మాకు బ్రహ్మాండమైన విందు ఏర్పాట్లు జరిగాయి. అదిగో ఆ విందు లోనే లింగయ్య తన కొడుకును నాకు పరిచయం చేశాడు.

"వీడే సారూ మా అబ్బాయి. పది దాక చదివిండు. ఉన్న ఒక బిడ్డ పెండ్లి అయిపోయింది. ఇంకో ఏడాదికో రెండేండ్లకో వాలంటరీ పెట్టుకొనినంక మీ దయవల్ల వీనికి నా పని కాస్త ఇప్పిస్తే ఆ తరువాత ఏ చీకూచింతా లేకుండా పోద్ది'' అంటూ చెప్పుకొచ్చాడు.

నేనా అబ్బాయిని పరీక్షగా చూశాను. పెద్దెనిమిది ఇరవై సంవత్సరాలుండొచ్చు. అంత బలమైన శరీరం కాకున్నా చూడటానికి చురుకైన వాడుగానే కనిపించాడు. ఆ పిల్లవాడు రెండు చేతులతో నమస్కరించి, పరిచయ పూర్వకంగా చిరునవ్వు నవ్వి అటు తరువాత తన పనిలో తానుండి పోయాడు.

మా విందు ముగిసిన తరువాత అందరితో నేనూ ఇంటి దారి పట్టాను. అక్కడి వాతావరణం చూసిన తరువాత నాకు నా బాల్యం గుర్తుకు వచ్చింది. మా నాన్న సర్‌సిల్క్‌లో పని చేసినప్పుడు సరిగ్గా మాకు అటువంటిదే ఒక గుడిసె వుండేది. ఆ గుడిసెలోనే అడ్డంగా పెట్టిన వెదురు తడికతో రెండు గదులుగా చేసి ఒక గదిలో మా అమ్మ వంట చేసేది. ముందు గదిలోనే మేమంతా ఉండేది. పండుకునేది. ఆ ఇరుకు గదిలోనే నేను, మా చెల్లి, అమ్మానాన్న, అప్పుడు మా తాత కూడా ఉండేవాడు. మా తాత బ్రతుకంతా మగ్గం గుంటలోనే గడిచిపోయింది. నేత పని చేసి బతకలేని రోజుల్లోనే మా నాన్న సర్‌సిల్క్‌లో పనికి వచ్చాడు. మా గుడిసెకు ఆనుకునే కంపెనీలో వాడేయగా మిగిలిన బొగ్గు బూడిదను పెద్ద పెద్ద కుప్పలుగా పోసేవాళ్ళు. అక్కడే ఆ కుప్పల మధ్యనే దుర్గంధ పూరితమైన ఆ వాతావరణంలోనే మేము మా బాల్యాన్ని గడిపాము.

నాకెందుకో కార్మికులు నివసించే ప్రాంతానికి ఎప్పుడు పోయినా, ఎందుకుపోయినా నా బాల్యం గుర్తుకు వస్తుంది. మట్టి కుప్పల మీద ఆటలు ఆడే పిల్లలన్నా, వయసు ఉడిగిపోయి కాళ్ళూచేతులు ఆడకుండా పోయిన ముసలి వాళ్ళు నిస్సారమైన చూపులతో గుడిసెల ముందు అరుగు కొసల ముందు కూర్చునే వారన్నా, అర్థాంతరంగా చదువులు ఆగిపోయి, పనీ పాటలు లేకుండా నిస్సారంగా రోజులు గడిపే యువకులు, ఊసుపోని కబుర్లతో తారట్లాడే వారన్నా నాకెందుకో కడుపులో చేయిపెట్టి దేవినట్టుగా ఉంటుంది.

రోజులు యాంత్రికంగా గడిచి పోతున్నాయి. తిండిబట్ట సంపాదించుకోవడంతోనే సర్వశక్తులు ఉడిగిపోతున్నాయి. మ్యాన్‌వే ఆఫీసు నుండి స్టోర్స్ గుమాస్తాగా ట్రాన్స్‌ఫర్ చేశారు.

ఇదివరలోనైతే మ్యాన్‌వేరైటర్‌గా పని చేసినప్పుడు ఎప్పుడూ మనుషుల మధ్య సందడిగా ఉండేది. అదో తృప్తిని ఇచ్చేది. కాని ఇప్పుడు ఏరిపారేసినట్లయింది పరిస్థితి. స్టోర్స్ సామాన్లను లెక్కలు గట్టి ఇవ్వడం, లెడ్జర్ పుస్తకాలతోనే సమయం గడిచిపోతుంది. విసుగు పుట్టించే రొటీన్ జీవితంతోనే నాలుగేండ్లు గడిచిపోయాయి.

అదిగో అటువంటి సమయంలోనే మొన్న మార్కెట్ కాడ నాకు లింగయ్య కనిపించాడు. నేను అతన్ని మొదట పోల్చుకోలేకపోయాను. చింపిరితల, మాసిపోయి చినుగులు పట్టిన అంగీ, మట్టి కొట్టుకుపోయిన దోతి... ఎన్నో రోజులుగా పెరిగిన నలుపు తెలుపు చారల గడ్డం. మెడల మీది కంటా పెరిగిన జుట్టు మట్టితో జడలు కట్టుకొనిపోయింది. ఒక్కక్షణం నివ్వెరపోయి అతనో కాదో తేల్చుకోలేక నిలబడిపోయాను. అతను నన్ను సమీపించాడు. వెలిగా

(మిగతా 23వ పేజీలో)

✻ తెలకపల్లి రవి

దారి తప్పిన ప్రయాణీకుడి దివాళా కథనం..

సిపిఐ సిద్ధాంత కర్తగా, దాని నుంచి కూడా బహిష్కృతుడైనాక యుసిపిఐ కార్యదర్శిగా రాజకీయ వర్గాలకు పరిచితుడైన మొహిత్‌సేన్ ఆత్మకథా కథనం ఇది. ఉన్నతాధికారులు, విద్యావంతుల కుటుంబంలో పుట్టిన సేన్ బాల్యం, విద్యార్జన, ప్రభావితం చేసిన పెద్దలు తదితర అంశాలు ఇందులో వున్నాయి. లండన్‌లో చదువుకున్న మొహిత్‌సేన్ రజనీపామీదత్, ఎరిక్‌హాబ్స్‌వామ్, మారిస్‌డోబ్ తదితరులతో సన్నిహితంగా మెలిగారు. చైనా వెళ్లి అనుకోని పరిస్థితుల్లో అక్కడ సైద్ధాంతిక పాఠశాలలో విద్యార్థిగా చాలా కాలం వుండిపోయారు. ఆ అనుభవాలూ రాశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక వచ్చినపుడు మొహిత్‌సేన్ సిపిఐతో ఉన్నారు. ఫాసిస్టులపై పోరాడటానికే ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించిందంటూ సంపూర్ణంగా బలపరచిన సేన్ 1977 ఎన్నికలలో ఓటమి తర్వాత మరింత సన్నిహితులైనారు. ఎమర్జన్సీని బలపరచడం తప్పని సిపిఐ ఆత్మ విమర్శ చేసుకోవడం ఆయనకు మింగుడుపడలేదు. చివరకు డాంగే అధ్యక్షుడుగా యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఏర్పరచారు. ఈ రాజకీయ యాత్రనంతటినీ ఇందులో గ్రంథస్తం చేశారు. దాంతోపాటే తన అభిప్రాయాలు, వ్యక్తుల గురించి అంచనాలు రాయడానికి చాలా స్థలం కేటాయించారు. అవే అత్యంత అనుచితంగా వున్నాయి.

వ్యక్తిగతంగా తనబంధు మిత్రుల గురించి, ఆఖరుకు తమ పెంపుడు కుక్క గురించి ఎక్కడ లేని ఆర్ద్రతతో రాసే మొహిత్‌సేన్ తన ఉద్యమ సహచరులలో అత్యధికుల మంచి లక్షణాలు చూడలేకపోగా చవకబారు నిందలు వేసిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది.

మచ్చుకు సుందరయ్యపై అవాకుల సారాంశం చూడండి:

'ఆయన ఒక కరుడుగట్టిన మొండివ్యక్తి. ప్రదర్శన కోసం పాకులాడుతుంటాడు. కనకే పార్లమెంటుకు సైకిలెక్కి వెళ్లాడు. తనే విమర్శించే రివిజనిస్టు లక్షణాలుండబట్టే రాజ్యసభకు వెళ్ళాడు. తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి అనిపించుకోవడానికి పెట్టాబేడా సర్దుకుని ఆంధ్రకు పరుగెత్తుకొచ్చాడు. ఆయన తన మాట వినేవారిని పైకి తెచ్చి బాగా చూసుకుంటారు. ఆయన పెద్ద మేధావికాదు. ఆయనకు శిష్యులు, ప్రత్యర్థులు తప్ప సహచరులు లేరు.' 'చివరకు ఆయన పార్టీనుంచి కూడా మూటాముల్లె సర్ది అజ్ఞాతంలోకి పంపించారు..'

పార్లమెంటుకు తను సైకిల్ ఎక్కివెళ్లడం గొప్ప విషయం కాదని ,జీపులోనూ వెళ్లేవాణ్ణి సుందరయ్య తన జీవితకథలో రాశారు. నిజానికి అయన ప్రజా ఉద్యమ జీవితంలోనూ చాలా కాలం సైకిల్ ఉపయోగించడమే కాదు, చాలా వేగంగా తొక్కేవారు. చివరి క్షణం వరకూ అశేష ప్రజలకు ప్రియతమ నాయకుడై శత్రువులు కూడా చేతులెత్తి నమస్కరించే వ్యక్తిత్వం గల సుందరయ్యపైనే ఇలాటి చౌకబారు వ్యాఖ్యలు చేసిన మొహిత్ సేన్ మిగిలిన విషయాలు ఏమాత్రం వాస్తవికంగా రాస్తాడో వూహించవచ్చు. సిపిఐ నేతగా తనకు ప్రాచుర్యం రావడానికి దోహదపడిన చంద్ర రాజేశ్వరరావు గురించి కూడా ఇలాటి రాతలే.' రాజేశ్వరరావు



ఎ ట్రావెలర్ అండ్ ద రోడ్,
ది జర్నీ ఆఫ్ యాన్ ఇండియన్ కమ్యూనిస్ట్,
రచన: మొహిత్ సేన్,
వెల: రూ. 395,
ప్రచురణ: రూపా అండ్ కో. న్యూఢిల్లీ.

పెద్ద మేధావికాదు. గుత్తాధికార లాలసుడు. మురాల కోరు.' ఎమర్జన్సీని బలపరచడం సరైందేనని తాను చేసిన వాదనను రాజేశ్వరరావు పూర్తిగా బలపరచాడట. కాని తర్వాత మహాసభలో విమర్శలు వచ్చేసరికి ప్లేటు మార్చి తనతో విడగొట్టుకున్నారట. కారణం ఏదైనా వాస్తవిక వైఖరి తీసుకున్నందుకు రాజేశ్వరరావుపై ఇన్ని ఆరోపణలు చేసిన సేన్ అవకాశవాదానికి మారు పేరైన డాంగేను తన ఆదర్శపురుషుడుగా అడుగడుగునా కీర్తిస్తాడు. రాజకీయం కాకపోయినా ఇక్కడే ఇంకో విషయం పేర్కొనడం సముచితంగా వుంటుంది. ఆయన భార్య వనజాఅయ్యంగార్‌ను ఎన్టీఆర్ తొలి మహిళా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా అవకాశమిచ్చిన సందర్భాన్ని గురించి కూడా ఇలాగే ఎకసెక్కంగా రాస్తారు.

సేన్ స్టాలిన్ పేరు చెబితే ఉలిక్కిపడతారు. చైనా అన్నా అదే ద్వేషం. తనకు నచ్చని మేధావులను, పార్టీ నాయకులను కూడా స్టాలినిస్టులని తిట్టిపోస్తాడు. ఒక్క ఎకెగోపాలన్‌ను గురించి కొంత ప్రశంసా పూర్వకంగా రాసినా ఆయన దృష్టిలో మహానాయకురాలు ఇందిరాగాంధీ. సామ్యవాద మహా సంస్కర్త గోర్బచెవ్.పార్టీని నమ్ముకోవడం వల్లనే గోర్బచెవ్ దెబ్బతిన్నాడని అంటారు. 2002 వరకూ జీవించి సోవియట్ విచ్ఛిన్నానంతర ప్రపంచ పరిణామాలను ప్రత్యక్షంగా చూసిన తర్వాత కూడా మొహిత్‌సేన్ వంటి వారు ఇలా రాయడంలో సామాన్యుల ఇంగిత జ్ఞానాన్ని పరిహసించడమే కనిపిస్తుంది.

ఆయన మరణానికి ముందు, తర్వాత కూడా పలువురు కమ్యూనిస్టేతర మేధావులు ఈ రచన ఆత్మ విమర్శనాత్మకమైందన్నట్లు ప్రశంసిస్తూ కమ్యూనిస్టులకు కనువిప్పు కావాలని సలహాఇచ్చారు. కాని వాస్తవానికి చరిత్ర ఎన్ని పాఠాలు నేర్పినా మితవాద అవకాశవాదం ఎన్ని సార్లు పల్టీలు కొట్టినా కళ్లు తెరవనిది మొహిత్‌సేన్ వంటివారే. కమ్యూనిజంపై విశ్వాసం కోల్పోయి బూర్జువావర్గం వెంటబడిన పచ్చి మితవాద భావజాలమే ఇందులో వున్నది. దానికే నగిషీలు. కమ్యూనిస్టు పద్ధతులపై విషం కక్కే వ్యాఖ్యలు పుస్తకంలో కోకొల్లలు. కమ్యూనిస్టు ఉద్యమం అంటేనే పిడివాదమనే భావం కలిగించడానికి పడ్డ ప్రయాసలో కొంతైనా దాని ఔన్నత్యాన్ని, వర్గ పోరాట చైతన్యాన్ని పేర్కొనడానికి కేటాయించరు. వాటన్నిటినీ వివరంగా ఉటంకించడం స్థలాభావం దృష్ట్యా సాధ్యం కాదు, అవసరమూ లేదు.

ఇంత పుస్తకంలోనూ తనగురించి ఆత్మవిమర్శగా రాసుకోకపోవడం యాధృచ్ఛికం కాదు. జాతీయ స్థాయిలో అనేక మంది అగ్రనాయకులతో భుజాలు రాసుకుని తిరిగి, అంతర్జాతీయంగానూ సోషలిస్టు నేతలతో పలు సార్లు సంభాషణలు జరిపిన ఆయనపై వాటి ప్రభావం ఇసుమంతైనా లేకపోవడం ఎలా సంభవం? ఎలా అంటే అది అవకాశవాద పెటీ బూర్జువా మేధావుల సహజ స్వభావం. వ్యక్తిగత ప్రయోజనాల రీత్యా గాని, పుర్రెలో పుట్టిన బుద్ధిని పట్టి కాని ఏదైనా గిట్టకపోతే వారు విశాల ప్రయోజనాలను గాలికొదలడానికి, తమ స్వీయాత్మకతకే పట్టం కట్టడానికి కాస్తయినా వెనుకాడరు. "ట్రావెలర్ అండ్ ద రోడ్" (ప్రయాణీకుడు- దారి)'అన్నప్పుడు అది విశాల జన రాశుల విముక్తి దారి కావాలని కోరుకునేవారు ఇలాటి రాతలను విమర్శనాత్మకంగా చదవకతప్పదు. ●

* సిహెచ్.వి.వి.రఘుబాబు

టీవీ, సినిమాల ప్రభావంతో నాటక రంగం కొడిగట్టిన ప్రస్తుత పరిస్థితులలో సురభి నాటకాలు మాత్రం కళారంగంలో మకుటం లేని మహారాజుగా ప్రకాశిస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రేక్షకుల అభిరుచికి తగినట్లుగా సురభి నాటకాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజాదరణ పొందుతున్నాయి. నాటక రంగంలోనే సురభి సంస్థ తన కంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టుకుని దేశంలోనే ప్రాచుర్యం పొందింది. ప్రపంచ నాటకరంగ చరిత్రలో సురభి సంస్థ ఒక మైలు రాయిగా నిలుస్తోంది. తరతరాలుగా నాటక రంగాన్నే నమ్ముకున్న ఒకే కుటుంబ సభ్యుల సమిష్టికృషితో ఏర్పాటైన సురభి సంస్థకు నాటకాలే ఊపిరి అయ్యాయి.



నేటికీ గుభాళిస్తున్న సురభి నాటక సౌరభాలు

ఇటీవల జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రి, కొవ్వూరు, నర్సాపురంలో నాటక ప్రదర్శనలు ఇచ్చేందుకు వచ్చిన సురభి సంస్థ నిర్వాహకులను ప్రజాశక్తి కలిసి ప్రస్తుత నాటక కళారంగ పరిస్థితుల గురించి అడగ్గా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆవివరాల్లోకి వెళదాం పదండి.

125 సంవత్సరాల క్రితం మహారాష్ట్ర నుండి వలస వచ్చిన కళాకారులు కడప జిల్లా రాయిచోటి తలూకా సురభి గ్రామంలో స్థిరపడ్డారు. తొలుత తోలుబొమ్మలాట ప్రదర్శనలు ఇస్తున్న వీరు 1885 సంవత్సరంలో వనారస గోవిందరావు, వనారస రామయ్యల ఆధ్వర్యంలో తొలిసారిగా "కీచకవధ" నాటకాన్ని ప్రదర్శించారు. అప్పటి నుండి నాటక ప్రదర్శనలు ప్రారంభించిన వీరు సురభి సంస్థగా గుర్తింపు పొందారు. ఆనాటి నుంచి సురభి సంస్థ శాఖోపశాఖలుగా విస్తరించి అభివృద్ధి చెందింది. 1930 సంవత్సరంలో గోవిందరావు కుమార్తె సుభద్రమ్మ శ్రీకాకుళం జిల్లాలో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి స్థాపించారు. ఇది అనతి కాలంలోనే దినదిన ప్రవర్ధమానమై 64 సురభి నాటక సంస్థలుగా ఏర్పడి నాటకాలకు జీవం పోశాయి.

కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ఆదాయం తక్కువ ఖర్చు ఎక్కువైన నేపథ్యంలో నాలుగు సురభి నాటక సమాజాలు మాత్రం నడుస్తున్నాయి. ప్రస్తుతం నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ఒక్కొక్కటి, కరీంనగర్ జిల్లాలో రెండు సురభి నాటక సమాజాలు ఉన్నాయి. నాటకానికి రూపునిచ్చింది, కళను ప్రసాదించింది సురభి సంస్థగా పేర్కొనవచ్చు. ఆంధ్రనాటక కళోద్ధారక వనారస గోవిందరావు నాటక కళలో పాత్రలకు అనుగుణంగా పాత్రధారులు ఉండేలా సురభి సంస్థను తయారు చేశారు. పాత్రకు తగ్గ వయస్సు ఉన్న వారే పాత్రధారులుగా ఉంటారు. ఇందుకు చిన్న పిల్లలనుండి చదువుకునే విద్యార్థుల వరకూ కుటుంబ సభ్యుల్లోనే ఆయా పాత్రలకు ఎంపిక చేస్తారు. నాటకానికి తగినట్లుగా ఎఫెక్ట్స్, ట్రిక్స్, భారీ సెట్టింగ్‌లతో సురభి నాటకాలను ప్రదర్శించబడుతున్నాయి. దృశ్యానికి తగ్గ సీన్లను క్షణాల్లో మార్చడానికి 12 మంది సిద్ధంగా ఉంటారు. ఒక్కో ప్రాంతంలో సంవత్సర కాలం ఉంటూ నెలకు 15 నాటకాలను ప్రదర్శిస్తుంటారు. ఇందుకు వేదికల్ని నిర్మించుకోవాలంటే దాదాపు నెలరోజుల పాటు శ్రమించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన వస్తువులు, పరికరాలను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి చేరవేయడానికి లారీలను ఉపయోగిస్తుంటారు. నాటకాలను ప్రదర్శించేందుకు థియేటర్ ఏర్పాటుకు సుమారు 70 వేల రూపాయలు ఖర్చుచేస్తారు. నాటక రంగంలో సురభి ఒక్కటే దృశ్యనాటకంగా నిలవడం విశేషం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ సురభి నాటకాలను ప్రదర్శించారు. సాంఘిక, పౌరాణిక, జానపదాలకు చెందిన దాదాపు 26 నాటకాలను వీరు ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా బాలనాగమ్మ, మాయాబజారు, కృష్ణలీలలు, లవకుశ, బ్రహ్మంగారి చరిత్ర, చండీప్రియ, హరిశ్చంద్ర, కురుక్షేత్రం, బొబ్బిలి యుద్ధం, పాతాళభైరవి వంటివి సురభి సంస్థ ప్రదర్శించే నాటకాల్లో ప్రధానంగా నిలుస్తాయి. నేషనల్ ఫెస్టివల్, జైపూర్ రంగ మంచ్, డ్రామా ఫెస్టివల్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో సురభి సంస్థ కళాకారులు పలు నాటక ప్రదర్శనలు ఇచ్చారు. 1999 సంవత్సరంలో ఢిల్లీలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డి) ఆధ్వర్యంలో సురభి ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఆది నుండి సురభి నాటకాలకు హైదరాబాదుకు చెందిన గరిమెళ్ల రామ్మూర్తి ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లు సురభి కాళాకారులు చెబుతుంటారు. 1996 సంవత్సరంలో పద్మశ్రీ కారంత్ ఎన్ఎస్‌డి, ఆర్ఆర్‌సి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో తొలిసారిగా సురభి కళాకారులకు భీష్మ అనే పౌరాణిక నాటకాన్ని నేర్పించి, ప్రదర్శింపచేశారు. నాటకంలో మాట్లాడడంలో మార్పు తీసుకువచ్చింది కూడా ఆయనే అని చెబుతారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా నాటక ప్రదర్శనలు ఇవ్వాలనే ఉద్దేశంతో 1997 సంవత్సరంలో "చండీప్రియ", 1999 సంవత్సరంలో "భస్తీదేవత యాదమ్మ" అనే నాటకాలకు కారంత్ స్వయంగా దర్శకత్వం వహించి, సురభి కళాకారులకు నేర్పించారు. భస్తీదేవత యాదమ్మ నాటకానికి 1999 సంవత్సరంలోనే నంది అవార్డు కూడా లభించింది. ఇతర దేశాల్లో నాటక ప్రదర్శనలకు ఆఫర్లు వచ్చినా భారీ సెట్టింగ్‌లతో విమానాల్లో వెళ్లాలంటే సాధ్యం కావడం లేదని సురభి కాళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదవ తరం నుండి ఏడవ తరం వరకూ ప్రస్తుతం సురభి కళాకారులు నాటకాలు ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సురభి కళాకారులకు అంతంత మాత్రంగా ప్రోత్సాహం ఇస్తుండగా, రాష్ట్రప్రభుత్వం అదికూడా ఇవ్వడం లేదు. దేశవ్యాప్తంగా ఉర్రూత లూగిస్తున్న సురభి కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం ఇచ్చి నాటక రంగాన్ని నిలదొక్కుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇతర నాటకాలకు, తమ నాటకాలకు చాలా తేడా ఉందని, సమిష్టి కృషి, సజీవ దృశ్యాల వంటి వాటితో తమ సంస్థకు ఒక ప్రత్యేకత ఉందని సురభి సంస్థ కళాకారులు జయచంద్రన్ వెల్లడించారు. ఇందువల్లే మిగిలిన నాటక రంగం కనుమరుగవుతున్నా తమ సంస్థ వేసే నాటకాలకు ఆదరణ తగ్గలేదని అంటున్నారు. ●

※ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఆరేళ్ళ అనంతరం...

చుట్టూ పచ్చని కొండలు... ఓ పక్క మెల్లగా ప్రవహించే సెలయేరు.. ఏపుగా ఎదిగి చుట్టూ ఆవరించి వున్న వృక్షాలు ఆ గ్రామానికి పెట్టని ఆభరణాలుగా కొత్త అందాన్ని ఇస్తాయి. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో కరియల్ బ్రాహ్మణ గ్రామం ఒక కుగ్రామం.... నగర వాతావరణం వెతికినా కన్పించని పల్లెటూరు.

ఎప్పుడూ నిశ్చలంగా ఉండే ఆ గ్రామానికి హఠాత్తుగా పండుగ వాతావరణం వచ్చింది. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం గ్రామస్తుల్ని ఆనంద డోలికల్లో ముంచెత్తింది. గ్రామస్తులందరూ కలిసికట్టుగా కదిలారు... ఉత్సాహంగా నడుం బిగించారు. అన్ని ఇళ్ళ మీద జాతీయ పతాకాలను ఎగురవేశారు. గ్రామమంతా రంగురంగుల జెండాలు కట్టారు.

కరియల్ బ్రాహ్మణ గ్రామంలో చైతన్య పుష్పం విరిసింది.

గ్రామస్తులంతా ఎంత ఆనందం అనుభవిస్తున్నారో ఒక్క కైలాస్‌దేవి అంతటి ఆనందాన్ని పొందుతోంది. ఆమె మనసులోంచి లావాలా ఎగజిమ్ముతున్న ఉద్వేగాన్ని అణచుకోలేకపోతోంది.

"రంజిత్ నిజంగా వస్తాడంటావా?" ఆమె మాతృహృదయంలో నిజాన్ని నమ్మలేని సందేహం...

"తప్పకుండా వస్తాడు... ఈసరికి బయలుదేరే ఉంటాడు!" గ్రామ పెద్ద సమాధానం గొప్ప సంతృప్తిని కలిగిస్తోంది.

దూరంగా పాతకాలం నాటి ఇల్లు.

రంగులు వెలిసిపోయి విషాదానికి చిహ్నంగా ఉన్న ఆ ఇంట్లో కైలాస్‌దేవి ఎదురు చూస్తోంది. ఆమె కళ్ళల్లో మాతృహృదయపు ఆనందం కలిగించిన వెలుగు ఇంటికి కొత్త ఆనందాన్ని తెచ్చింది.

ఆమె కుమార్తె... రంజిత్ ముద్దుల చెల్లెలు ఆషా ఉదయాన్నే కళ్ళాపు చల్లి ముగ్గు వేసింది. ఆరేళ్ళ తర్వాత కలుసుకోబోయే అన్నయ్య కోసం 'వెల్‌కం' అంటూ ఇంగ్లీషులో రంగులతో ఆహ్వానాన్ని రాసింది.

అన్నయ్య కోసం చెల్లి...

కొడుకు కోసం తల్లి... ఎదురు చూస్తున్నారు.

ఇంతలో బాణాసంచా చప్పుడు....

కైలాస్‌దేవి గుండెల చప్పుడు పెరిగింది.

దూరంగా దుమ్ము రేపుకుంటూ రెండు జీపులు గ్రామంలోకి ప్రవేశించాయి. వాటి వెనుక కారు...

గ్రామస్తులంతా వాటిని చుట్టు ముట్టారు. అందరిలోనూ కేరింతలు... ఆనందం...

ముందుగా స్థానిక పోలీసులు దిగారు. తర్వాత సరిహద్దు భద్రతా దళం సైనికులు దిగారు. ఆ తర్వాత వెనుక కారులోంచి అధికారులు... ఇరవయ్యేళ్ళ రంజిత్ కుమార్ దిగారు.

ఈ దృశ్యాన్ని చూసి కైలాస్‌దేవి కళ్ళల్లో నీరు తిరిగాయి. అప్రయత్నంగా బొట్లు బొట్లుగా కన్నీరు కిందకి జారిపోయింది.

జీవితంలో అత్యంత సంతోషాన్ని కలిగించిన ఆ రోజు ఆగస్టు 30, 2003 సంవత్సరం ఆమె మనస్సులో నిలిచిపోయింది.

ఉత్సాహంగా ఇంటి మెట్లు దిగి ఆరేళ్ళ తర్వాత కన్పించిన కొడుకు కోసం ఎదురేగి వెళ్ళింది.

* * *

పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న కరియల్ బ్రాహ్మణ గ్రామంలో మధ్య తరగతి కుటుంబానికి చెందిన రంజిత్ కుమార్ చిన్నతనం నుంచి ఆకతాయిగా పెరిగాడు. చదువు అబ్బలేదు.

వాఘాలో ఉన్న బంధువుల ఇంటిలో ఉండి చదువుకోమని తల్లిదండ్రులు ఎంతో పోరు పెట్టారు. ఆటల మీద ఉన్న ఆసక్తి చదువుమీద లేకపోవడంతో వారి మాట తలకెక్కలేదు.

"చదువు జీవితానికి పరమావధి. అది లేకపోతే చాలా కష్టం" అని కైలాస్‌దేవి కొడుకును మందలించింది. రంజిత్ తల్లి మాట వినకుండా ఎదురు తిరిగాడు. కోపం పట్టలేక చదువు లేకపోతే కొడుకు భవిష్యత్ ఏమవుతుందోనని పక్కనున్న కర్రతీసి వీపు మీద ఒక దెబ్బ వేసింది.

'చదువుకోకపోతే నీకు తిండి కూడా బంద్!' హెచ్చరించింది.

తల్లిమాటలతో రంజిత్ తల్లడిల్లిపోయాడు.

పదమూడేళ్ళ వయస్సు. అప్పుడప్పుడే స్వతంత్ర భావాలు మొగ్గతొడుగుతున్నాయి.

"ఇంటిలో నుంచి పారిపోవడం ఒక్కటే పరిష్కార మార్గం" మనసులో అనుకున్నాడు. వెంటనే కరియల్ బ్రాహ్మణ గ్రామాన్ని దాటి బైట ప్రపంచంలో అడుగు పెట్టాడు

తిరుగుతూ తిరుగుతూ ఆ సమీపంలో వున్న సరిహద్దును దాటి పాకిస్తాన్‌లో ప్రవేశించాడు. అప్పటికి ఆ ప్రాంతం ఏ దేశం పరిధిలో ఉందో కూడా రంజిత్ కుమార్‌కు తెలియదు.

పాకిస్తాన్ సరిహద్దు భద్రతాదళం రంజిత్ కుమార్‌ను అరెస్ట్ చేసి పాకిస్తాన్ జైల్లో పెట్టారు. ఎంత మొత్తుకుంటున్నా... తన విషయాలు వివరిస్తున్నా వినేవారు కరువయ్యారు. దీంతో జైలు గోడల మధ్య అందమైన బాల్యం, టీనేజ్ యవ్వనం అంతా కోల్పోయాడు.

సియోల్‌కోట్, గుజ్రన్‌వాలా, లాహోర్ ప్రాంతాల్లో జైళ్ళలో తిప్పారు. అక్కడి అధికారులు రంజిత్ కుమార్ వివరాల కోసం అధికారికంగా ప్రయత్నించినా ఫలితం కన్పించలేదు.

జైల్లో ఓ అధికారి ద్వారా విషయం తెలుసుకుని తన వివరాలతో రంజిత్ కుమార్ తల్లికి ఉత్తరం రాశాడు. అతనికి ఆ ఉత్తరం అందుతుందన్న

నమ్మకం అయితే లేదు. అది అందింది. రంజిత్ జైలు బతుక్కు విముక్తి లభించింది.

జమ్మూలో భారత ప్రభుత్వ అధికారుల ద్వారా తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయి. ఎట్టకేలకు పాకిస్తాన్ ప్రభుత్వం తమ దేశంలో ప్రవేశించిన రంజిత్‌ను యువకునిగా తయారైన తర్వాత అప్పగించింది.

ఆగస్టు 30, 2003న అధికారుల ఆధ్వర్యంలో అప్పగింత కార్యక్రమం సజావుగా సాగింది.

* * *

ఇంటిలో ప్రవేశించిన కొడుకు రంజిత్ కుమార్‌ను తల్లి కైలాస్‌దేవి కౌగలించుకుంది. ఆరేళ్ళ వియోగం ఆమె మాతృహృదయాన్ని ద్రవించి వేసింది. పొగిలి పొగిలి ఏడ్చింది.

దేవుడి పటం ముందుకు తీసుకువెళ్ళి దిష్టి తీసి హారతి ఇచ్చింది. కుంకుమతో బొట్టు కూడా పెట్టింది.

చెల్లి ఆషా అన్నయ్య చేతికి రాఖీ కట్టింది.

గ్రామస్తులంతా వస్తున్నారు. చూస్తున్నారు. వచ్చిన వారందరికీ కైలాస్ దేవి స్వీట్లు నోట్లో పెడుతోంది.

విలేకర్లు కూడా వచ్చి ప్రశ్నల వర్షం కురిపించారు.

"పాకిస్తాన్ జైళ్ళు నరక కూపాలు... ఎన్ని కష్టాలు పడ్డానో తలచుకోవడానికే బాధగానూ, భయంగానూ ఉంది. ఇప్పుడు స్వేచ్ఛాజీవిని..." రంజిత్ కుమార్ అనుభవాలను వివరించి చెబుతున్నాడు.

"దేవుడి దయ వల్ల నా బాబు రంజిత్ తిరిగి వచ్చాడు... ఇప్పుడు నాకు ఎంతో ఆనందంగా ఉంది!" కైలాస్‌దేవి అంది.

"మా అమ్మకే కాదు..నాకూ ఎంతో ఆనందంగా ఉంది. నన్ను కని, పెంచిన జనని మా అమ్మ దగ్గరికి వచ్చినందుకు... నేను పుట్టిన ఊరు... పెరిగిన గ్రామం... నా మాతృభూమిలోకి తిరిగి అడుగు పెట్టినందుకూ నాకు ఎంతో ఆనందంగా ఉంది–" రంజిత్ కుమార్ గొంతు బొంగురు పోయింది.

దూరంగా పచ్చని కొండలు.. ఓ పక్క మెల్లగా ప్రవహించే సెలయేరు... ఏపుగా ఎదిగిన చెట్లు. కరియల్ బ్రాహ్మణ గ్రామంలో రంజిత్ కుమార్‌కు కొత్త అందాలు కనిపిస్తున్నాయి. ●

ఓ తండ్రి కథ

(19వ పేజీ తరువాయి)

అతనే. నేను ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే 'ఏ లింగయ్యా! ఏందీ ఇలా తయారయ్యావు' అంటూ నిలదీశాను.

లింగయ్య ఒక్క క్షణం నిలబడిపోయి... వేదాంతిలా ఒక పిచ్చి నవ్వు నవ్వాడు. ఆ నవ్వును చూస్తే నాకెందుకో భయమేసింది. అతను నా ముందుకు వచ్చి చెయ్యి చాపాడు విచిత్రంగా అదే పిచ్చినవ్వుతో.

'ఏమైందీ ఈ మనిషికి? పిచ్చిగిట్ల లేవలేదు కదా!" నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. నాలుగేండ్లుగా నేను స్టోర్ రూమ్ రైటర్‌గా పని చేస్తూ అతన్ని గమనించలేదు. అతని గురించి పట్టించుకోలేదు. అతను కూడా ఏ అవసర నిమిత్తమై నన్ను కలవలేదు.

అతని భుజం తట్టి 'ఏమైంది లింగయ్యా! ఏంటి ఈ అవతారం. ఆరోగ్యం సరిగా లేదా?' అంటూ అతని ముఖంలోకి చూశాను.

నిస్సారమైన అతని కండ్ల నిండా నీళ్లూరినయి, పట పట మంటూ కళ్ళ నీళ్ళు కారి గడ్డంలో ఇంకిపోయాయి.

అప్పటికే రోడ్డు మీద జనం మాకేసి వింతగా చూస్తున్నారు. అది కనిపెట్టి అతని భుజం పట్టుకొని రోడ్డు పక్కనే ఉన్న చిన్న గుడిసె హోటల్లోకి లాక్కుపోయి అక్కడ బెంచీ మీద కూర్చోబెట్టి రెండు చాయ్‌లకు ఆర్డర్ ఇచ్చాను. నా పక్కన కూర్చున్న లింగయ్య ఒక్కసారిగా నా పొట్టలో తల పెట్టి చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. అతన్ని ఓదార్చడం చాలా కష్టమైంది. చాయ్ పిల్లవాడు రెండు చాయ్‌లు తెచ్చి బెంచీ మీద పెట్టి పోయాడు. చాయ్ కాస్తున్న హోటల్ యజమాని అసహనంగా మాకేసి చూస్తున్నాడు.

'చాయ్ తాగు' అంటూ ఒక చాయ్ తీసి అతని చేతికిచ్చాను. అతను చాయ్ అందుకొని అదే పనిగా దానికేసి పిచ్చి చూపు చూస్తూ... 'నా కొడుకును చంపేసింద్రు సారూ' అంటూ చేతిలో గ్లాసును టేబుల్ మీద పెట్టి మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

నాకేమీ అర్థం కాలేదు. 'ఏమైంది? ఎందుకు?' అన్నాను అదిరిపడి.

'నా కొడుకు ఎవరినీ ఎప్పుడూ చటాలున చెంపదెబ్బకొట్టి ఎరగడు. ఆ రోజు తెల్లారు గట్ల నా పక్కనే చాప మీద ఆదమరిచి నిద్దుర పోతాండు. గప్పుడు బిలబిల మంటూ వచ్చింద్రు.. అగో గట్ల పండుకున్న వాన్ని పండుకున్నట్టుగానే సెక సెక తన్నుకుంటూ లాక్కపోయింద్రు. నేను చూస్తుండగానే నా కళ్ళ ముందే నా కొడుకును ఎత్తకపోయింద్రు." అతను ఎటో చూస్తున్నాడు. కాని అతని కండ్లలో ఆ సంఘటన తాలూకు నీలి నీడలు కదలాడుతున్నట్టుగా అతను విలవిలలాడాడు.

"ఎవరు? ఎవరు ఎత్తుకు పోయారు' అంటూ నేను అడిగిన ప్రశ్నకు అతను నా మొఖంలోకి తీక్షణంగా చూసి నన్నో వెర్రివాని కింద జమకట్టినట్టుగా చిత్రంగా నవ్వాడు.

ఆ కండ్లలో మళ్ళీ నీళ్ళు నిండుకున్నాయి. 'నేను వాన్ని నా గుండెల మీద ఎత్తుకొని పెంచాను. నేను దిగిపోయి వానికి పని పెట్టిద్దామనుకున్నా. వానికి పెండ్లిచేసి పిల్లాపాపలతో వాడు కలకలలాడుతుంటే చూడాలనుకున్నా. నా ఆశలన్నీ అడియాశలైనాయి. నాకు ఏం మిగిలింది సారూ" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేకపోయాను.

'వాని శవాన్ని మీరు చూడలేదు సారూ. నేను చూశాను. వాని పొళ్ళంతా పుణికి పుచ్చుకొని మరీ చూశాను. వాని ఒంటి మీద చిందుమెత్తు సందు లేకుండా కమిలిపోయింది. వాని రెండు రెక్కలు విరిచేశారు. ఇగో అవి ఇట్లా వేలాడుతున్నాయి (అంటూ అతను యాక్షన్ చేసి మరీ చూపెట్టాడు). వాని పాదాలు ఎంతగా కందిపోయాయంటే పాదాలు పగిలిపోయి రక్తం చారలు కట్టి నల్లగా అట్టుకట్టుకుపోయాయి. వాని ముఖాన్ని మీరు చూడలేరు సారూ. నల్లగా రొట్టె పెంకులా కమిలిపోయింది. బాధతో నా తండ్రి తట్టుకోలేకేమో వాడు పండ్లతో కింద పెదవిని ఎంత కరుచుకున్నాడంటే, పండ్లు సగం వరకు కింది పెదవిలోనే దిగబడి పోయాయి.'

లింగయ్య ఇంకా చెపుతూనే వున్నాడు. అతని కడుపులో దాగిన దుఃఖాన్ని లావాలా వెళ్ళగక్కుతూనే ఉన్నాడు. మాసిపోయిన చింపిరితల, బారుగడ్డం తీవ్రమైన వేదనతో వర్షించే కండ్లు. నా హృదయంలో గుచ్చుకుంటున్నాయి. అనంతమైన దుఃఖాన్ని నిక్షిప్తం చేసుకున్న అతని చూపులను తట్టుకోలేక నేను చూపులు దించుకున్నాను.

అప్పటికే ఆ హోటల్లో ఉన్న నలుగురైదుగురు మా మాటలు వింటూ అదే పనిగా మా వైపు చూస్తున్నారు. నేను అక్కడ ఉండలేక బయటపడుతుంటే.

అంత దాకా మా మాటలు విన్న నడీడు వ్యక్తి ఒకడు 'మొన్న వేజు బోర్డు సమ్మె అప్పుడు పోలీసులు ఆయన కొడుకును పట్టుకపోయి కాల్చేసింద్రు' అంటూ ఆ పక్కనే ఉన్న మరొకతనితో చెపుతున్నాడు. చాయ్ డబ్బులు ఇచ్చి ఇక లింగయ్యతో ఒక్కమాట కూడా మాట్లాడకుండా రోడ్డెక్కాను.

నేను అక్కడి నుండి పారిపోయి వచ్చా. "కాని నిర్లిప్తంగా నిస్పృహతో వర్షించే లింగయ్య చూపులు నన్ను వెంటాడుతూనే వున్నాయి. తలకిందులైన విలువలను ప్రశ్నిస్తున్నట్టుగా, వ్యవస్థీకృతమైన హత్యాకాండను నిలదీస్తున్నట్టుగా నన్ను ఆ చూపులు వెంటాడుతూనే వున్నాయి."

అంతా సాఫీగానే ఉంది. జనం ఉరుకులు పరుగులతో రోడ్లన్నీ ఎప్పటిలాగే నిండుకొని వున్నాయి. బడబడలాడే బావి మీద బంకరు. నిప్పులు ఎగజిమ్మే విద్యుత్ కేంద్రపు గొట్టం అంతా సజావుగానే ఉంది. బారు తుపాకుల పోలీసుల వ్యవహారాల మధ్య కాలనీ అంతా ప్రశాంతంగానే ఉన్నట్టుగా ఉంది.

'కాని ఈ అలజడి నాకు ఊపిరి సలుపనీయటం లేదు. లింగయ్య అవే పిచ్చి చూపులు. మళ్ళీ, మళ్ళీ గుచ్చుకుంటున్నాయి. ప్రశ్నిస్తున్నాయి. ●

✻ కొండబాబు

తెలుగు 'పదా'ర్థం

"**పో**యిన వారం ఏవో కొన్ని పదాల గురించి వివరిస్తానన్నావ్...!" గుర్తు చేశాడు సుబ్రహ్మణ్యం కైలాసం ఇంటి వరండాలో కూర్చుంటూ.

"మొదలెట్టావ్.. వచ్చేవారం చెప్తాకానీ, ఈ వారం కొన్ని 'పదాల రాత' గురించి వ్యాసం రాద్దామనుకుంటున్నాను. 'థీసిస్'ని ఇప్పుడు నీకు సమర్పిస్తాను అన్నాడు కైలాసం హాస్యంగా.

"సరే చెప్పు.. లేదా ఇప్పటికే రాసిన ప్రతి ఉంటే ఇవ్వు.."

"సరే అలాగే"

"మనం రోజూ చాలా పదాలు వాడుతుంటాం. అలవోకగా రాసేస్తాం. ఎవరైనా మిత్రులు ఈ పదం ఇలాగే ఉంటుందా? ఈ అక్షరానికి ఒత్తు అవసరమా? కాదా? అని సందేహం వ్యక్తపరిస్తే కొందరు సందిగ్ధంలో పడిపోతారు. ఉంటుందో, ఉండదో ఇతమిద్ధంగా చెప్పలేక పోతారు. తరతమ తేడాలతో ఇలాంటి పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు అందరి అనుభవంలోకీ రావటం కద్దు.

పత్రికారచనకు పాండిత్యం అక్కర్లేదని పెద్దలు చెబుతారు. అది నిజం కూడా. అయితే భాషా పరిజ్ఞానం, పద ప్రయోగం పట్ల కనీస అవగాహన లేకున్నా ఫర్వాలేదని కాదు దాని అర్థం. 'పదా'ర్థానికి, పదావిర్భావానికి సంబంధించిన పరిజ్ఞానం కొంచెమైనా ఉండటం పాత్రికేయులకు తప్పనిసరి అవసరం. పదాల పరిశీలన, భాషానియమాల పరిచయం తెలిసుంటే చాలా మంచిది. దీని వల్ల అప్పుడప్పుడూ తలెత్తే 'అక్షర సందేహాలకు' సమాధానాన్ని సులభంగా వెతుక్కునే వీలుంటుంది.

మనం ఈ రోజు ఏ పత్రిక చూసినా కనీసం ఒకటి రెండు చోట్ల కొన్ని పదాలు అపభ్రంశతో కనిపిస్తాయి. వీటిని దగ్గరగా పరిశీలిస్తే కాని వాటిలోని తప్పు చప్పున తెలీదు. 'వాగ్దానం' అంటే సామాన్యజనం వాడుకలో మాటివ్వడం. వాక్కు (మాట), దానం (ఇవ్వడం), అనే రెండు పదాల కలయిక అది. 'దానం' రాయమంటే 'ధానం' అని ఎవరూ రాయరు. 'వాగ్దానం' రాయమనే సరికి దాకు గూటం (ధ) తగిలిస్తారు. ఇది కావాలని చేస్తున్న పని కాదు. అలవాటులో పొరపాటు. మొదటి నుంచీ ఇలాగే రాస్తున్నాం, చూస్తున్నాం, అనేది కూడా కొందరి వాదన. 'వాగ్దానం' అంటే వాక్, దానం అనే పదాల కలయికతో ఏర్పడ్డ సంధి ప్రయోగ మాటని, 'దానం'కు లేని గూటం 'వాగ్దానం'లో రాదని మనకు మనం తర్కించుకుంటే – వాగ్దాన ప్రయోగం తప్పుగా చేయం. పదాల ఉత్పత్తి గురించికొంతైనా తెలుసుకోవడం ఇందు గురించే అవసరం. దిగ్బంధనం కూడా ఇలాంటిదే. తరచూ పత్రికల్లో ఇది తప్పుగా 'దిగ్భందనం'గా కనిపిస్తుంటుంది. 'బంధనం'లో లేని 'భ'ను దిగ్భందనంలోకి తీసుకురావడం తప్పే. ఇంకా ఇలాంటి పదాలు చాలా ఉన్నాయి. నివాసం సరిగానే రాస్తున్న వారం 'నివశించు' అని తప్పుగా రాస్తున్నారు. అవలంబనంలో రాయని భ అవలంభించడంలో కనిపిస్తుంది. 'స్వావలంబనం' కూడా ఈ కోవకే వస్తుంది. విధితం అని రాస్తున్నారు కొందరు. రోదనలో కూడా 'ధ' అని రాస్తున్నారు. అక్షరాలకు గూటం తగిలిస్తే పద తీవ్రత పెరిగి, భారంగా చెప్పినట్లు, ఘోరంగా ఏడ్చినట్టూ ఉంటుందనుకుంటున్నారో ఏమో.

పేరుల్లోనూ..

మల్లికలో 'ఖ' రాయని వాళ్లు 'మల్లిఖార్జునుడు', మల్లిఖార్జునరావు, (మల్లికార్జునుడు, మల్లికార్జునరావు) అనే రాస్తున్నారు. సింహం అని సరిగా రాసినవాళ్లే 'నర్శింహరావు, నర్శింహ, అని తప్పుగా రాస్తున్నారు. ఇక పేర్లకు సంబంధించి తరచూ తప్పులొచ్చే జాబితాలో శ్రీనివాసరావు, మధుసూదనరావు ఉంటారు. కొందరు 'శ్రీనువాసరావు, మధుసూధనరావు' అని రాస్తున్నారు. అలా రాయటం తప్పు. శ్రీ అంటే లక్ష్మి. లక్ష్మి నివసించేదే శ్రీనివాసం. శ్రీనివాసరావు. జగన్నాథం, జనార్దన్ అనే వాటి విషయంలోనూ తప్పులు రాస్తున్నారు. పరిగణన అనే మాట రాసేటప్పుడు కొందరు న ను గణనలోకి తీసుకోవడం లేదు. దానిని హరించి పరిగణ, పరిగణనలోకి రాస్తున్నారు. శబ్దరీత్యా చూసినప్పుడు అది సరైన ప్రయోగమని భ్రమ కల్గడమే దీనిక్కారణం.

పరిశీలన అవసరం

పదాలను, అక్షరాలను పరిశీలించడం, పదాల పుట్టుకలో సూత్రాలను తెలుసుకోవటం పట్ల ఆసక్తి ఉంటే, దానిని కూడా ఒక పనిగా పెట్టుకుంటే ఇలాంటి తప్పులకు ఆస్కారం ఉండదు. పత్రికల్లో ఏమి రాస్తున్నారో కూడా చూడాలి. అయితే ఒక పత్రికలోనే వేర్వేరు చోట్ల వేర్వేరుగా పదాలు దర్శనమిస్తే సందిగ్ధంలో పడిపోతాం. అలాంటప్పుడు మనం పనిచేసే పత్రిక శైలి పుస్తకాన్ని చూడాలి. అందులో నిర్ధారించిన దాన్నే రాయాలి. అందులోనూ దొరకని పదాల గురించి ప్రామాణిక గ్రంథాలను, నిఘంటువులను తిరగేయడం అవసరం. అలా చేస్తే సందేహం తీరిపోతుంది. ప్రత్యేకంగా వెతికి రూఢీ చేసుకొనే పదాలు బాగా జ్ఞాపకం ఉండిపోతాయి కూడా. భాషకు సంబంధించిన వ్యాసాలు ఏ పత్రికల్లో వచ్చినా చదవడం మంచిది. పాత్రికేయులు పదాల పరమార్థాలను తెలుసుకొని ఉంటే భాషాపరమైన తలవంపులు ఉండవు. ●

పాఠక స్పందన

కవర్ స్టోరీ విజ్ఞానదాయకం

సెప్టెంబర్ 14వ తేదీ సంచికలో కవర్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన 'ఎనీటైంమనీ ఏ.టి.ఎమ్ పని' వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంది. ఎ.టి.ఎం.ల పని తీరుపై చక్కటి బొమ్మలతో ఇచ్చిన తీరు బాగుంది. అవి ఎలా పనిచేస్తాయో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అందించారు. అయితే ఎక్కువగా ఆంగ్ల పదాలు దొర్లాయి. వాటికి కూడా తెలుగు పదాలను ఇచ్చి ఉంటే ఇంకా బాగుండేది. ఏదేమైనా సాంకేతిక పరమైన విషయాన్ని తేలిక భాషలో దాదాపు అందరూ అర్థం చేసుకునే పద్ధతిలో ఇవ్వడం హర్షణీయం.

– పెండెం శాంతిలక్ష్మి, హైదరాబాద్

సచిన్‌ను విమర్శించడం సబబు కాదు

సెప్టెంబర్ 14 ఆదివారం అనుబంధంలో క్రీడారంగంలో ప్రచురించిన 'సచిన్‌పై అంత ప్రేమెందుకు?' ఐటెమ్‌లో ప్రభుత్వాన్ని విమర్శించిన తీరు బాగుంది. అదే సందర్భంలో సచిన్‌పై విమర్శ చేయడం సరైంది కాదు. భారత క్రికెట్‌కు ఎనలేని సేవ చేసిన సచిన్ క్రీడాస్ఫూర్తికి మారు పేరు. అటువంటి సచిన్‌పై విమర్శలు చేయడం బాగాలేదు. ఇలాంటి విమర్శల వల్ల సచిన్ మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం కూడా వుంది. అలాగే కవర్ స్టోరీ విజ్ఞాన దాయకంగా వుంది. ఇంతకాలం మాకు ఏ.టి.ఎమ్. కౌంటర్‌లోకి డబ్బులు ఎట్లా వస్తాయా అని ఆశ్చర్య పోయే వాళ్ళం. కవర్ స్టోరీ చదివాక చాలా విషయాలు తెలిశాయి.

– అరుణ కుమారి, విజయవాడ

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ఫోకస్



ఫోటో : కె.నరహరి